PRGI Reg No -“APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి....

శుభోదయ

ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి 01, సంచిక 206, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, బుధవారం - 16 - సెప్టెంబర్ - 2026 , వెల రూ.5/-



## దేశం నుంచి ఆశించడమే కాదు.. సేవ చేయండి
## జెన్ జెడ్, జెన్ ఆల్ఫాకు నిర్మల సీతారామన్

దేశం కోసం ఏం చేయగలరో యువత ఆలోచించాలన్న నిర్మలా సీతారామన్

యువత నాయకత్వం చేపట్టి దేశానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్న కేంద్రమంత్రి

ప్రపంచ అనిశ్చితిలోనూ భారత్ 7.8 శాతం వృద్ధి సాధించిందని వ్యాఖ్య

తమిళనాడులో గ్లోబల్ కంపెనీలతో ఉపాధి అవకాశాలు పుష్కలమన్న మంత్రి

## ట్రంప్ కూడా మా కాంగ్రెస్ హామీలనే కాపీ కొడుతున్నారు: డీకే శివకుమార్



తమ ప్రభుత్వ గ్యారెంటీ పథకాలు సక్సెస్ అయ్యాయన్న డీకే శివకుమార్

కర్ణాటక మోడల్ ను రాజస్థాన్, బీహార్ వంటి రాష్ట్రాలు అనుసరించాయన్న సీఎం

ఇప్పుడు ట్రంప్ కూడా తమ తరహా హామీలు



## నేడు నెల్లూరు జిల్లాకు మంత్రి లోకేశ్.. పలు కార్యక్రమాలకు శ్రీకారం

- నెల్లూరు నగరంలో ఆధునికీకరించిన రెండు ప్రభుత్వ పాఠశాలల ప్రారంభోత్సవం
- కోవూరులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్న లోకేశ్
- కోవూరు నియోజకవర్గ టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమన్వయ సమావేశం

## ప్రైవేటు కోచింగ్ సెంటర్లపై చంద్రబాబు సీరియస్.. కఠిన చర్యలకు ఆదేశం



- ప్రభుత్వంపై బురద జల్లేందుకు అభ్యర్థులను రెచ్చగొడుతున్నాయని కోచింగ్ సెంటర్లపై ఆరోపణ
- రాజకీయ ప్రయోజనాల కోసమేనని ప్రభుత్వ నిర్ధారణ
- జీవో నెం.9 నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని వెల్లడి
- రాజకీయ కుట్రల్లో భాగస్వాములను చేస్తే సహించేది లేదని స్పష్టీకరణ

# ఏపీలో పురపాలక ఎన్నికల దిశగా ఈసీ అడుగులు

ఫారం-1 నోటీసుతో పాటు వార్డుల వారీ ఫొటో ఓటర్ల జాబితాలను ఈనెల 22న ప్రకటించాలి

- ★ 12 నగరపాలక సంస్థలు, 29 పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో వార్డుల వారీగా ఫొటో ఓటర్ల జాబితాల తయారీ
- ★ రాష్ట్రంలోని 106 పురపాలక, నగర పంచాయతీల్లో డీలిమిటేషన్ పూర్తయిన 58 చోట్ల కూడా సెప్టెంబరు 3నే జాబితాలను వెల్లడించారు




అమరావతి: ఏపీలో పురపాలక సంఘాల ఎన్నికల నిర్వహణ సన్నద్ధత ప్రక్రియ వేగవంతమైంది. ఇందులో భాగంగా మరో 12 నగరపాలక సంస్థలు, 29 పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో వార్డుల వారీగా ఫొటో ఓటర్ల జాబితాల తయారీ, ప్రచురణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. మిగతా 2 లో



## మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని హఠాన్మరణం

- గుండెపోటుతో ఆళ్ల నాని మృతి
- 1969లో ఏలూరులో జన్మించిన ఆళ్ల నాని
- గత ఏడాది వైసీపీని వీడి టీడీపీలో చేరిన నాని

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఏపీ మాజీ డిప్యూటీ సీఎం

# ‘నెమ్మదిగా యూపీఐ లావాదేవీలపై ఛార్జీలకు తెరతీశారు’..

మోదీ సర్కార్‌పై రాహుల్‌గాంధీ తీవ్ర ఆరోపణలు

- రూ.2,000కు మించిన యూపీఐ లావాదేవీలపై ఛార్జీకి అవకాశం ఉందని రాహుల్ ఆరోపణ
- రూ.2,000 వరకు యూపీఐ చెల్లింపులపై ఛార్జీలు ఉండవని కేంద్రం స్పష్టీకరణ
- అంతకుమించిన లావాదేవీల విషయంలో స్పష్టంగా చెప్పని కేంద్రం
- ఎండీఆర్ భారం చివరకు వినియోగదారులపైనే పడొచ్చన్న రాహుల్ గాంధీ



ఢిల్లీ: యూపీఐపై ఛార్జీల విధింపునకు కేంద్ర ప్రభుత్వం తలుపులు తెరిచిందంటూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మిగతా 2 లో

## రష్యాపై ఆంక్షల బిల్లులో భారత్ పేరు..
# ట్రంప్ సర్కార్‌కు ప్రతిపాదన

దేశాలపై టారిఫ్‌లతో విరుచుకుపడేందుకు అమెరికా సర్కార్ సిద్ధమవుతోంది

- 00 శాతం టారిఫ్‌లు ఎదుర్కొనే దేశాల జాబితాలో భారత్‌తో పాటు చైనా, తుర్కియే, అజర్‌బైజాన్, హంగేరీ, స్లోవేకియా, యూఏఈ, సింగపూర్, కజకిస్థాన్, కిర్గిస్థాన్ పేర్లను చేర్చాలి
- రష్యా వాణిజ్య భాగస్వామ్య దేశాలపై విస్తృత సుంకాలను విధించే అధికారాన్ని అధ్యక్షుడికి కల్పించే సెక్షన్ 113ని పూర్తిగా రద్దు చేయాలి



: రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే భారత్, చైనా వంటి దేశాలపై టారిఫ్‌లతో విరుచుకుపడేందుకు అమెరికా సర్కార్ సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించిన కీలక బిల్లును ఈ వారం ప్రతినిధుల మిగతా 2 లో

# ఆగా ఖాన్ ఫౌండేషన్ ద్వారా మరింత సహకారం అందించాలి

## 15 వేల ఎకరాల్లో గ్రీన్ జోన్ ఏర్పాటు

- 30 వేల ఎకరాల్లో అత్యాధునిక సదుపాయాలతో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం
- తెలంగాణలోని విద్యా, పర్యాటక, వైద్య రంగాల్లో కలిసి పని చేద్దాం
- 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం
- డిసెంబర్ 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు భారత్ ఫ్యూచర్ సిటీ



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ఆగా ఖాన్ ఫౌండేషన్ ద్వారా మరింత సహకారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని విద్యా, పర్యాటక, వైద్య రంగాల్లో కలిసి పని చేద్దామని కోరారు. భారత పర్యటనలో ఉన్న ఆగా ఖాన్ ఫౌండేషన్ చైర్మన్ హిజ్ హైనెస్ ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-ఎ గారు హైదరాబాద్ వచ్చిన సందర్భంగా మిగతా 2 లో



## లోతుకుంట భూ వివాదంపై సుప్రీం తీర్పు.. స్పందించిన హైడ్రా కమిషనర్

- కాలపరిమితి ముగియడంతో సాంకేతిక కారణాలతో సుప్రీంకోర్టు ఆ పటిషన్‌ను కొట్టివేసింది
- సుప్రీంకోర్టు ఆదేశాలతో అన్ని భాగస్వామ్య వర్గాలు, రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటాం
- జనరల్ ల్యాండ్ రిజిస్టర్ 243లో పేర్కొన్న 119 ఎకరాల భూములపై సమగ్ర సర్వే నిర్వహించాలి
- సర్వే నంబర్ 1, 2 కు సంబంధించి ప్రైవేట్ భూమిపై ఉన్న కోర్టు ఉత్తర్వులకు జీఎల్ఆర్ నంబర్ 243, 255కు ఎలాంటి సంబంధం లేదు

## నా పీఆర్ఓ, పీఏపై 15 మంది గూండాలు దాడి చేశారు: కేటీఆర్



- సైఫాబాద్ పోలీస్ స్టేషన్ లో ముసుగులు ధరించిన వ్యక్తులు దాడికి పాల్పడ్డారన్న కేటీఆర్
- పీఎస్ బయట, లోపల ఉన్న సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని డిమాండ్
- రేవంత్ పాలనతో తెలంగాణ రౌడీ రాజ్యంలా మారిందని మండిపాటు

## ప్రైవేటు కోచింగ్ సెంటర్లపై చంద్రబాబు సీరియస్..
# కఠిన చర్యలకు ఆదేశం

అమరావతి: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులను ప్రభుత్వానికి వ్యతిరేకంగా రెచ్చగొడుతున్న ప్రైవేటు కోచింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వంపై బురదజల్లే లక్ష్యంతో విద్యార్థులను ఆందోళనలకు ఉసిగొల్పుతున్నారని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. ఈ మేరకు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే సంస్థలపై చట్టప్రకారం ముందుకెళ్లాలని స్పష్టం చేశారు. కొన్ని ప్రైవేటు కోచింగ్ కేంద్రాల యాజమాన్యాలు తమ స్వార్థ, రాజకీయ ప్రయోజనాల కోసం అభ్యర్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. పోటీ పరీక్షల కోసం తమ వద్ద శిక్షణ పొందుతున్న యువతపై ఒత్తిడి తెచ్చి, వారిని రాజకీయ ప్రేరేపిత నిరసనలు, ధర్నాలలో పాల్గొనేలా చేస్తున్నట్లు తేలిందని అధికారులు పేర్కొన్నారు. దురుద్దేశంతోనే అభ్యర్థులను ఈ ఆందోళనల వైపు మళ్లిస్తున్నారని ముఖ్యమంత్రికి వివరించారు. వాస్తవానికి, ఆంధ్రప్రదేశ్ కోచింగ్ సంస్థల నియంత్రణ నిబంధనలు 2026, జీవో నెంబర్ 9 ప్రకారం ప్రైవేటు కోచింగ్ కేంద్రాలు నిర్దేశిత మార్గదర్శకాలకు లోబడి పనిచేయాల్సి ఉంటుంది. అయితే, ఈ నిబంధనలను పక్కనపెట్టి కొన్ని సంస్థలు రాజకీయ కార్యకలాపాలు నడుపుతున్నాయని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, అభ్యర్థులను రాజకీయ కుట్రల్లోకి లాగాలని చూస్తే కఠిన పరిణామాలు తప్పవని ప్రభుత్వం హెచ్చరించింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ఏ కోచింగ్ సెంటర్‌పైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంలో వెనుకాడేది లేదని స్పష్టం చేసింది.

## దేశం నుంచి ఆశించడమే కాదు.. సేవ చేయండి
### జెన్ జెడ్, జెన్ ఆల్ఫాకు నిర్మల సీతారామన్

ఢిల్లీ: దేశం నుంచి మనం ఏం ఆశించాలనే దానికంటే, దేశానికి మనం ఏం చేయగలమనే అంశంపైనే యువత ప్రధానంగా దృష్టి సారించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పిలుపునిచ్చారు. యువత ఆకాంక్షలను వినడానికి దేశం సిద్ధంగా ఉందని, అయితే అదే సమయంలో వారు తమ పౌర బాధ్యతలను కూడా చిత్తశుద్ధితో నిర్వర్తించాలని ఆమె సూచించారు. మంగళవారం చెన్నైలోని డాక్టర్ ఎంజీఆర్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 36వ స్నాతకోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. "యువత నాయకత్వం బాధ్యతలు చేపట్టాలి. దేశ హితానికే ప్రథమ ప్రాధాన్యతనివ్వాలి. దేశం సురక్షితంగా, పటిష్ఠంగా ఉన్నప్పుడే మనకు నివసించడానికి ఒక ప్రశాంతమైన ఆవాసం ఉంటుంది. మన మాతృభూమిని ఎన్నటికీ వదులుకోకూడదు" అని నిర్మల సీతారామన్ పేర్కొన్నారు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, మధ్యప్రాచ్యంలో నెలకొన్న అశాంతి వంటి ప్రపంచ పరిణామాలను ప్రస్తావిస్తూ, దేశ భద్రత, స్థిరత్వం యొక్క ఆవశ్యకతను ఆమె ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి నెలకొన్నప్పటికీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ స్థూల ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకుంటూ 7.8 శాతం వృద్ధి రేటును సాధించిందని ఆమె కొనియాడారు. తమిళనాడు రాష్ట్రం పారిశ్రామిక, సాంకేతిక రంగాలలో హబ్‌గా విరాజిల్లుతోందని, ముఖ్యంగా శ్రీపెరంబుదూర్–ఒరగడమ్ కారిడార్ ఆటోమొబైల్, స్మార్ట్‌ఫోన్ల ఎగుమతుల అంతర్జాతీయ కేంద్రంగా నిలుస్తోందని తెలిపారు. కోయంబత్తూరు, మధురై వంటి నగరాల్లోని గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీలు) వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయని ఆమె వివరించారు. ఉద్యోగినులను ప్రోత్సహించేందుకు వీలుగా ప్రతి జిల్లాలో వర్కింగ్ విమెన్స్ హాస్టళ్లను ఏర్పాటు చేసేందుకు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులను కేటాయించినట్లు ఆమె గుర్తుచేశారు. ఈ సందర్భంగా 'తిరుక్కురళ్'లోని సూక్తులను ఉటంకిస్తూ, పట్టభద్రులు అహంకారాన్ని వీడి వినయంతో మెలగాలని, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని ఆమె హితవు పలికారు.

## ట్రంప్ కూడా మా కాంగ్రెస్ హామీలనే కాపీ కొడుతున్నారు

కర్ణాటక: కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ గ్యారెంటీ పథకాలు అంతర్జాతీయ స్థాయిలో ప్రజాదరణ పొందాయని, చివరికి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కూడా తమ పథకాలనే కాపీ కొడుతున్నారని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వ్యాఖ్యానించారు. బెంగళూరులో విలేకరులతో మాట్లాడిన ఆయన, తమ ప్రభుత్వ గ్యారెంటీ పథకాలు బ్లాక్‌బస్టర్ విజయం సాధించాయని అన్నారు. నవంబర్‌లో జరిగే అమెరికా మిడ్‌టర్మ్ ఎన్నికల్లో రిపబ్లికన్లు గెలిచి కాంగ్రెస్‌లోని ప్రతినిధుల సభ, సెనెట్‌లపై ఆధిపత్యం సాధిస్తే ప్రతి వయోజన అమెరికన్‌కు 5,000 డాలర్ల చొప్పున 'డివిడెండ్' ఇస్తామని ట్రంప్ ప్రకటించడాన్ని డీకే శివకుమార్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. గతంలో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, బీహార్ వంటి రాష్ట్రాలు తమ కర్ణాటక మోడల్‌ను అనుసరించాయని, ఇప్పుడు ప్రపంచంలోనే అగ్రరాజ్యమైన అమెరికా అధ్యక్షుడు కూడా ఓటర్లను ఆకట్టుకునేందుకు ఇదే తరహా సంక్షేమ హామీలను ఇస్తున్నారని పేర్కొన్నారు. ఇది కాంగ్రెస్ సిద్ధాంతాలకు, భారత రాజ్యాంగ విలువలకు దక్కిన అంతర్జాతీయ గుర్తింపు అని ఆయన అభివర్ణించారు.

## 'నెమ్మదిగా యూపీఐ లావాదేవీలపై ఛార్జీలకు తెరతీశారు'..
# మోదీ సర్కార్‌పై రాహుల్‌గాంధీ తీవ్ర ఆరోపణలు

ఢిల్లీ: యూపీఐపై ఛార్జీల విధింపునకు కేంద్ర ప్రభుత్వం తలుపులు తెరిచిందంటూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. రూ.2,000కు మించిన యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించే అవకాశం కల్పించారని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీపై కూడా ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "యూపీఐపై ఛార్జీలు విధించేందుకు మోదీ ప్రభుత్వం నిశ్శబ్దంగా తలుపులు తెరిచింది. రూ.2,000కు మించిన యూపీఐ వ్యాపార లావాదేవీలపై ఇప్పుడు ఎండీఆర్ విధించవచ్చు" అని రాహుల్‌గాంధీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఇలాంటి లావాదేవీలు మొత్తం యూపీఐ లావాదేవీల్లో పరిమాణం పరంగా కేవలం ఆరు శాతం మాత్రమే ఉన్నా.. మొత్తం లావాదేవీల విలువలో దాదాపు 65 శాతం వాటా కలిగి ఉన్నాయని ఆయన తెలిపారు.

రూ.2,000 వరకు మాత్రమే ఛార్జీలు ఉండవా?

బ్యాంకులు, పేమెంట్ వ్యవస్థ సంస్థలు రూ.2,000 వరకు యూపీఐ లావాదేవీలపై, రూపే డెబిట్ కార్డు చెల్లింపులపై ఛార్జీలు వసూలు చేయకూడదని కేంద్రం ఆదేశించింది. అయితే రూ.2,000కు మించిన లావాదేవీలపై వ్యాపారుల నుంచి ఛార్జీలు తీసుకోవచ్చా లేదా అన్న విషయాన్ని తాజా ఆదేశాల్లో స్పష్టంగా చెప్పలేదు. ఇప్పటివరకు లావాదేవీల మొత్తంతో సంబంధం లేకుండా యూపీఐపై ఎలాంటి ఛార్జీ లేదు. దీంతో కొత్త నిబంధనలపై రాజకీయ చర్చ మొదలైంది.

చివరకు భారం వినియోగదారులపైనేనా?

వ్యాపారులపై ఎండీఆర్ విధించినా ఆ భారాన్ని చివరకు వినియోగదారులే భరించాల్సి వస్తుందని రాహుల్‌గాంధీ అన్నారు. వ్యాపారులు ఆ అదనపు ఖర్చును వస్తువుల ధరల్లో కలిపే అవకాశం ఉందని పేర్కొన్నారు. అమెరికా చెల్లింపు సంస్థల వాణిజ్యాలను భారత్‌లో అమల్లో ఉన్న జీరో-ఎండీఆర్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నాయని, ఇప్పుడు అదే దిశగా కేంద్రం అడుగులు వేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా కేంద్రంపై మండిపడ్డారు. ద్రవ్యోల్బణంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపశమనం కల్పించాల్సిన ప్రభుత్వం.. వారి జేబులపై మరో భారం మోపే ప్రయత్నాన్ని చేస్తుందని విమర్శించారు.

ఎందుకు ఎండీఆర్?

యూపీఐ లావాదేవీలు భారీగా పెరగడంతో సైబర్ భద్రత, మోసాల నివారణ, డిజిటల్ మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం పెద్ద మొత్తంలో ఖర్చు అవుతోందని కేంద్రం చెబుతోంది. ఈ వ్యవస్థను దీర్ఘకాలంలో స్వయం సమృద్ధిగా కొనసాగించేందుకు ఛార్జీల విధింపు అవసరమని పేర్కొంది. మరిన్ని సంస్థలు ఈ రంగంలోకి వచ్చి పోటీ పెంచాలన్నా స్థిరమైన ఆదాయ నమూనా అవసరమని కేంద్రం భావిస్తోంది. సబ్సిడీలపైనే ఆధారపడటం ద్వారా యూపీఐ తదుపరి దశ వృద్ధిని కొనసాగించడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. ఎండీఆర్ రేట్లను నిర్ణయించే బాధ్యతను ఎన్‌పీసీఐ ఆధ్వర్యంలోని యూపీఐ, సర్వీసెస్ స్టీరింగ్ కమిటీకి అప్పగించే అవకాశం ఉంది. దీంతో భవిష్యత్తులో రూ.2,000కు మించిన యూపీఐ చెల్లింపులపై ఛార్జీలు వస్తాయా? అన్నది ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది.

## మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని హఠాన్మరణం

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఏపీ మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఏలూరులోని తన నివాసంలో ఆయనకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించేలోపే ప్రాణాలు విడిచారు. ఆయన ఆకస్మిక మృతి వార్త ఏలూరు నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ వర్గాలు, పార్టీ శ్రేణులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆళ్ల నాని వయసు 56 సంవత్సరాలు. 1969లో ఏలూరులోని శనివారపుపేటలో జన్మించారు. ఏలూరు సి.ఆర్.రెడ్డి కాలేజీలో ఇంటర్మీడియట్, ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో బీకామ్ పూర్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన ఆళ్ల నాని, 2004లో తొలిసారిగా ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత 2009లో కూడా కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2013లో కాంగ్రెస్ కు గుడ్ బై చెప్పి వైసీపీలో చేరారు. 2017లో వైసీపీ తరఫున ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2019లోనూ ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం డిప్యూటీ సీఎంగా.. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. గత ఎన్నికల తర్వాత వైసీపీని వీడిన ఆయన 2025 ఏప్రిల్ లో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆళ్ల నాని మృతి పట్ల ఏపీకి చెందిన రాజకీయ నేతలు సంతాపం ప్రకటిస్తున్నారు. ఏలూరులో ఆయన భౌతికకాయాన్ని దర్శించుకునేందుకు అనుచరులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.

## నేడు నెల్లూరు జిల్లాకు మంత్రి లోకేశ్..
# పలు కార్యక్రమాలకు శ్రీకారం

అమరావతి: రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ రేపు (సెప్టెంబర్ 16) నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఒకే రోజు రెండు నియోజకవర్గాల్లో ఆయన పలు అభివృద్ధి, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇందుకు సంబంధించిన అధికారిక షెడ్యూల్ వివరాలు విడుదలయ్యాయి. పర్యటనలో భాగంగా తొలుత ఉదయం నెల్లూరు సిటీ నియోజకవర్గానికి చేరుకుంటారు. ఉదయం 10 గంటలకు స్టోన్ హౌస్ పేటలోని ఆర్ఎస్ఆర్ ప్రభుత్వ పాఠశాల ఆధునీకరణ పనులను, 11:10 గంటలకు మూలాపేటలోని డీఎస్ఆర్ ప్రభుత్వ పాఠశాల పనులను ప్రారంభిస్తారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో ముచ్చటించే అవకాశం ఉంది. మధ్యాహ్నం కోవూరు నియోజకవర్గంలో పర్యటన కొనసాగుతుంది. 12:15 గంటలకు కోవూరు పట్టణంలోని నెల్లూరు బైపాస్ వద్ద ఏర్పాటు చేసిన స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పెన్నా-విడవలూరు ప్రాంతంలో ఏర్పాటు చేసిన వేదికపై కోవూరు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నాయకులతో జరిగే సమన్వయ సమావేశంలో పాల్గొని దిశానిర్దేశం చేస్తారు. ఈ పర్యటనకు సంబంధించి స్థానిక టీడీపీ నేతలు ఏర్పాట్లు పూర్తి చేశారు.

# ఆగా ఖాన్ ఫౌండేషన్ ద్వారా మరింత సహకారం అందించాలి

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ఆగా ఖాన్ ఫౌండేషన్ ద్వారా మరింత సహకారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని విద్యా, పర్యాటక, వైద్య రంగాల్లో కలిసి పని చేద్దామని కోరారు. భారత పర్యటనలో ఉన్న ఆగా ఖాన్ ఫౌండేషన్ చైర్మన్ హిజ్ హైనెస్ ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-ఎ గారు హైదరాబాద్ వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి వారితో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో జరిగిన ఈ సమావేశంలో ఆగా ఖాన్ ఫౌండేషన్ ద్వారా తెలంగాణలో చేపట్టిన అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి గారు గుర్తుచేశారు. ఆగా ఖాన్ ఫౌండేషన్‌పై అత్యంత గౌరవం ఉందని పేర్కొంటూ, హైదరాబాద్‌తో ఆగా ఖాన్ గారి కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు తెలంగాణ వారసత్వ సంపదను పునరుద్ధరించడంలో ఫౌండేషన్ అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. ఫౌండేషన్ సహకారంతో ఇటీవల శాసనమండలి భవనాన్ని పునరుద్ధరించడం, అలాగే నగరంలోని కుతుబ్ షాహీ టూంబ్స్‌ను పునరుద్ధరించిన విషయాన్ని ముఖ్యమంత్రి గారు గుర్తుచేశారు. హైదరాబాద్ నగర పునర్నిర్మాణంలో భాగంగా మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టుపై సిద్ధం చేసిన ప్రణాళికలను ముఖ్యమంత్రి గారు వివరించారు. మూసీ నది వెంట నైట్ ఎకానమీ కార్యకలాపాల దిశగా తీర్చిదిద్దుతున్న విషయాలను తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఉన్న చారిత్రక సిటీ కాలేజ్, ఉస్మానియా ఆసుపత్రి భవనాల పునరుద్ధరణలో సహకరించాలని కోరారు. ఉస్మానియా ఆసుపత్రి కోసం గోషామహల్‌లో నూతన భవనాన్ని నిర్మిస్తున్నామని, ప్రస్తుత ఉస్మానియా ఆసుపత్రి భవనాన్ని వారసత్వ సంపదగా



తీర్చిదిద్దాలని భావిస్తున్నట్టు వివరించారు. డిసెంబర్ 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించబోయే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-ఎ గారిని ముఖ్యమంత్రి గారు ఆహ్వానించారు. సమ్మిట్‌కు 100కు పైగా దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణంపై ప్రిన్స్ ఆగా ఖాన్-ఎ గారు ఆసక్తిని కనబరిచి దాని ప్రాధాన్యతను అడిగి తెలుసుకున్నారు. 30 వేల ఎకరాల్లో అత్యాధునిక సదుపాయాలతో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని, అంతర్జాతీయ విమానాశ్రయానికి 20 నిమిషాల దూరంలో నిర్మించే ఫ్యూచర్ సిటీ పూర్తిగా నెట్-జీరో సిటీగా ఉండబోతోందని ముఖ్యమంత్రి గారు తెలిపారు. సింగపూర్‌కు చెందిన కంపెనీ ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తోందని, ఇందులో దాదాపు 15 వేల ఎకరాల్లో గ్రీన్ జోన్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఫ్యూచర్ సిటీలో అమెజాన్ వంటి సంస్థలు ఇప్పటికే తమ కార్యకలాపాలను ప్రారంభించాయని గుర్తుచేస్తూ 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని వివరించారు. ఇటీవల బ్రిటన్, అమెరికా పర్యటనల్లో వివిధ ప్రపంచస్థాయి యూనివర్సిటీలతో తెలంగాణ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల గురించి సీఎం సలహాదారు కె. రామకృష్ణా రావు గారు సమావేశంలో ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-ఎ గారికి వివరించారు. హార్వర్డ్ యూనివర్సిటీ, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌తో పాటు ఇతర యూనివర్సిటీలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలు ప్రారంభించడానికి అంగీకరించాయని తెలిపారు. ఫ్యూచర్ సిటీలో ఆగా ఖాన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా గారు కోరారు. పర్యాటక రంగంలో అగా ఖాన్ ఫౌండేషన్ పాత్రను స్పెషల్ చీఫ్ సెక్రటరీ వాణీ ప్రసాద్ గారు గుర్తుచేస్తూ భవిష్యత్తులో మరింత సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ గారు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గారితో పాటు ఉన్నతాధికారులు, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నా పీఆర్‌ఓ, పీఏపై 15 మంది గూండాలు దాడి చేశారు

హైదరాబాద్: హైదరాబాద్ లోని సైఫాబాద్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో తన పీఆర్‌ఓ మహేశ్ మాణిక్య, పీఏ మహేందర్ రెడ్డిపై దాడి చేశారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. యూనిఫాంలో ఉన్న పోలీసు అధికారుల సమక్షంలోనే ముసుగులు ధరించిన 15 మంది గుండాలు లోపలికి చొరబడి పక్కా ప్రణాళికతో ఈ దాడికి పాల్పడ్డారని... రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ వైఫల్యానికి ఇది నిదర్శనమని అన్నారు. ముఖ్యమంత్రి, హోంమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ రౌడీ రాజ్యంలా మారిందని, అణచివేతకు తలొగ్గని ప్రతీ పౌరుడికీ భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులే ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీ గేటు ఘటనకు సంబంధించి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి ఉన్నప్పటికీ, రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే విచారణ పేరుతో ఉదయాన్నే స్టేషన్‌కు పిలిపించి చీకటి పడే వరకు కాలయాపన చేసి ఈ కుట్రకు తెరలేపారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ గుండాలు ఈ దాడికి పాల్పడ్డారా? లేక పోలీసులే మఫ్టీలో ముసుగులు వేసుకుని వచ్చారా? అనే దానిపై నిజాలు బయటకు రావాలంటే తక్షణమే సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. స్టేషన్ లోపల, బయట ఉన్న సీసీటీవీ ఫుటేజీని వెంటనే భద్రపరచాలని, గాయపడిన తన సిబ్బందికి రక్షణ కల్పించి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ చర్యలను నిరసిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని 'ఎక్స్' వేదికగా ట్యాగ్ చేస్తూ 'వెల్‌డన్ కాంగ్రెస్' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

## ఏపీలో పురపాలక ఎన్నికల దిశగా ఈసీ అడుగులు

అమరావతి: ఏపీలో పురపాలక సంఘాల ఎన్నికల నిర్వహణ సన్నద్ధత ప్రక్రియ వేగవంతమైంది. ఇందులో భాగంగా మరో 12 నగరపాలక సంస్థలు, 29 పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో వార్డుల వారీగా ఫొటో ఓటర్ల జాబితాల తయారీ, ప్రచురణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు రెండు వేర్వేరు నోటిఫికేషన్లను జారీ చేసినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా వెల్లడించారు. ఫారం-1 నోటీసుతో పాటు వార్డుల వారీ ఫొటో ఓటర్ల జాబితాలను ఈనెల 22న ప్రకటించాలని పేర్కొన్నారు. 2026 జనవరి 1వ తేదీని అర్హత తేదీగా పరిగణించి, తాజా అసెంబ్లీ ఓటర్ల జాబితా ఆధారంగా రూపకల్పన చేయాలని సూచించారు. మొత్తం 17 నగర పాలక సంస్థలకు గాను విజయనగరం కార్పొరేషన్‌లో వార్డుల పునర్విభజన ప్రక్రియ ముందుగా పూర్తి కావడంతో అక్కడ సెప్టెంబరు 3 నాటికే ఓటర్ల జాబితా ప్రచురణ పూర్తయింది. అలాగే, రాష్ట్రంలోని 106 పురపాలక, నగర పంచాయతీల్లో డిలిమిటేషన్ పూర్తయిన 58 చోట్ల కూడా సెప్టెంబరు 3నే జాబితాలను వెల్లడించారు. మిగిలిన 12 నగర పాలక సంస్థలు, 29 పురపాలక, నగర పంచాయతీల్లో వార్డుల పునర్విభజన ప్రక్రియ సెప్టెంబరు 14 నుంచి 17 మధ్య పూర్తి కానున్నందున.. ఆయా చోట్ల ఓటర్ల జాబితా ప్రచురణకు కొత్త తేదీని ఖరారు చేయాలని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సెప్టెంబరు 13న ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని పరిశీలించిన ఎస్ఈసీ.. సెప్టెంబరు 22ను ప్రచురణ తేదీగా ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తాజా ఓటర్ల జాబితాల ప్రచురణతో ఆయా పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల నిర్వహణకు ఎస్ఈసీ సిద్ధం అవుతోంది. మేయర్లు, పురపాలక ఛైర్మన్లు, వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్లు ఖరారు చేయడానికి ప్రభుత్వానికి మరింత మార్గం సుగమం కానుంది. సంబంధిత కార్పొరేషన్ కమిషనర్లు , మున్సిపల్ కమిషనర్లు ఈ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు.

## రష్యాపై ఆంక్షల బిల్లులో భారత్ పేరు..
# ట్రంప్ సర్కార్‌కు ప్రతిపాదన

ఢిల్లీ: రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే భారత్, చైనా వంటి దేశాలపై టారిఫ్‌లతో విరుచుకుపడేందుకు అమెరికా సర్కార్ సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించిన కీలక బిల్లును ఈ వారం ప్రతినిధుల సభ ముందుకు తీసుకురానుంది. అయితే, ఈ బిల్లు లో భారత్ పేరును ప్రత్యక్షంగా చేర్చాలని డెమోక్రాటిక్ పార్టీ చట్టసభ్యులు ప్రతిపాదించారు. దివంగత సెనేటర్ లిండ్సే గ్రాహమ్ పేరు మీదుగా తీసుకొచ్చిన ఈ శాంక్షనింగ్ రష్యా, ఇరాన్ యాక్ట్ 2026ను అమెరికా సెనెట్ ఇప్పటికే 86-11తో ఆమోదించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ బిల్లులో రష్యా వాణిజ్య భాగస్వామ్య దేశాల పేర్లను నేరుగా ప్రస్తావించలేదు. కేవలం చమురు, గ్యాస్‌ను దిగుమతి చేసుకునే ఐదు అతిపెద్ద దేశాలంటూ పేర్కొన్నారు. దీన్ని సవరించాలని తాజాగా చట్టసభ్యులు ప్రతిపాదించారు. 100 శాతం టారిఫ్‌లు ఎదుర్కొనే దేశాల జాబితాలో భారత్‌తో పాటు చైనా, తుర్కియే, అజర్‌బైజాన్, హంగేరీ, స్లోవేకియా, యూఏఈ, సింగపూర్, కజకిస్థాన్, కిర్గిస్థాన్ పేర్లను చేర్చాలని డెమోక్రాటిక్ పార్టీ రిప్రజెంటేటివ్ స్టేనీ హోయర్ ప్రతిపాదించారు. కాగా.. రష్యా వాణిజ్య భాగస్వామ్య దేశాలపై విస్తృత సుంకాలను విధించే అధికారాన్ని అధ్యక్షుడికి కల్పించే సెక్షన్ 113ని పూర్తిగా రద్దు చేయాలని కోరుతూ మరో డెమోక్రటిక్ నేత ప్రతిపాదించడం గమనార్హం. ప్రతినిధుల సభలో ఈ బిల్లు ఆమోదం పొందిన తర్వాత అధ్యక్షుడి సంతకంతో ఇది చట్టరూపం దాల్చనుంది. నవంబరులో జరిగే మధ్యంతర ఎన్నికలకు ముందే ఈ బిల్లును ఆమోదింపచేసుకోవాలని ట్రంప్ సర్కారు భావిస్తోంది. ఉక్రెయిన్‌తో జరుగుతోన్న యుద్ధాన్ని ముగించేలా రష్యాపై ఒత్తిడి పెంచేందుకు అగ్రరాజ్యం ఈ బిల్లును తీసుకొచ్చింది. అప్పట్లో దీనిని ట్రంప్ ఆర్థిక బంకర్ బస్టర్‌గా అభివర్ణించారు. రష్యా అధికారులు, ఆర్థిక సంస్థలు, ఇంధన ప్రాజెక్టుల లక్ష్యంగా ఈ బిల్లును రూపొందించారు. మాస్కో నుంచి చమురు దిగుమతులు చేసుకునే దేశాలపై అధ్యక్షుడు అసాధారణ స్థాయిలో సుంకాలు విధించే అధికారం ఈ బిల్లుతో లభిస్తుంది.

## లోతుకుంట భూ వివాదంపై సుప్రీం తీర్పు..
# స్పందించిన హైడ్రా కమిషనర్



హైదరాబాద్: లోతుకుంటలో 40 ఎకరాల భూ వివాదంలో రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. కాలపరిమితి ముగియడంతో సాంకేతిక కారణాలతో సుప్రీంకోర్టు ఆ పటిషన్‌ను కొట్టివేసిందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో అన్ని భాగస్వామ్య వర్గాలు, రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని రంగనాథ్ తెలిపారు. జనరల్ ల్యాండ్ రిజిస్టర్ 243లో పేర్కొన్న 119 ఎకరాల భూములపై సమగ్ర సర్వే నిర్వహించాలని, సర్వే ద్వారా లోతుకుంట భూమి హద్దులు, వాస్తవ పరిస్థితులు స్పష్టంగా బయటపడతాయన్నారు. లోతుకుంటలోని సర్వే నంబరు 1, 2లోని శాంతా శ్రీరాం బిల్డర్స్ లేఔట్‌కు ప్రస్తుతం హైడ్రా కాపాడిన ప్రభుత్వ భూమికి మధ్య దూరం దాదాపు 3 కిలోమీటర్ల వరకూ ఉందని హైడ్రా హైకోర్టుకు విన్నవించింది. సర్వే నంబర్ 1, 2 కు సంబంధించి ప్రైవేట్ భూమిపై ఉన్న కోర్టు ఉత్తర్వులకు జీఎల్ఆర్ నంబర్ 243, 255కు ఎలాంటి సంబంధం లేదని హైడ్రా వాదించింది. ఈ వివాదంపై ఇటు ప్రభుత్వం, అటు నిర్మాణ సంస్థ ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయించడంతో విచారణ జరిపిన సుప్రీంకోర్టు... సాంకేతిక కారణాలతో ప్రభుత్వ పిటిషన్‌ను కొట్టివేసింది.

## షేక్ హసీనా తిరుగు ప్రయాణం ముంగిట షాక్
# ఏడుగురు అవామీ లీగ్ నేతలకు ఉరిశిక్ష

ఢిల్లీ: బంగ్లాదేశ్ రాజకీయంలో మరోసారి సంచలనాత్మక పరిణామాలు చోటుచేసుకున్నాయి. దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా వచ్చే డిసెంబర్‌లో భారత్ నుంచి తిరిగి బంగ్లాదేశ్‌కు వెళ్లనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో, అవామీ లీగ్ పక్షానికి అక్కడి అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ భారీ షాక్ ఇచ్చింది. 2024లో చోటుచేసుకున్న విద్యార్థుల పోరాటం, ఉద్యమ అణచివేత కేసులో మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై అవామీ లీగ్ జనరల్ సెక్రటరీ ఒబైదుల్ ఖాదర్‌తో సహా ఏడుగురు సీనియర్ నాయకులకు మరణశిక్ష ఖరారు చేస్తూ జస్టిస్ నజ్రుల్ ఇస్లామ్ చౌదరి నేతృత్వంలోని ట్రైబ్యునల్ మంగళవారం చారిత్రాత్మక తీర్పు వెలువరించింది.

ఉరిశిక్ష పడిన నేతలు:
ఒబైదుల్ ఖాదర్: ఆవామీ లీగ్ జనరల్ సెక్రటరీ ఽ మాజీ మంత్రి
బహావుద్దీన్ నసీమ్: జాయింట్ జనరల్ సెక్రటరీ
మహ్మద్ అలీ అరాఫత్: మాజీ సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి
షేఖ్ ఫజల్ షమ్స్ పరాష్, మైనుల్ హుస్సేన్ ఖాన్ నిఖిల్: జుబో లీగ్ నేతలు
సద్దాం హుస్సేన్: ఛాత్ర లీగ్ అధ్యక్షుడు
షేక్ వలీ ఆసిఫ్: ఛాత్ర లీగ్ జనరల్ సెక్రటరీ

2024 జూలై-ఆగస్టు నెలల్లో దేశంలో హసీనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగిన విద్యార్థుల ఉద్యమంపై విచక్షణారహితంగా దాడులు చేయించడం, హత్యలకు పురికొల్పడం, ప్రేరేపించడం వంటి తీవ్రమైన ఆరోపణలు రుజువు కావడంతో ఈ శిక్షలు విధించారు. గతంలోనే మాజీ ప్రధాని షేఖ్ హసీనాపై కూడా ఇదే ట్రైబ్యూనల్ మరణశిక్షను విధించిన సంగతి తెలిసిందే. తాను డిసెంబర్ నాటికైనా బంగ్లాదేశ్ చేరుకుని న్యాయస్థానాన్ని ఎదుర్కొంటానని హసీనా ప్రకటన చేసిన కొన్ని నెలల్లోనే, ఆమె ప్రధాన అనుచర బృందానికి విధించిన ఈ తీవ్రమైన తీర్పు అంతర్జాతీయ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## యూపీఐపై ఛార్జీలు విధిస్తే భారత్‌లో
# మళ్లీ క్యాష్ వినియోగం పెరుగుతుంది: అష్నీర్ గ్రోవర్

ఢిల్లీ: యూపీఐ చెల్లింపులపై ఛార్జీలు విధించే ఆలోచనపై 'భారత్‌పే' సహ వ్యవస్థాపకుడు అష్నీర్ గ్రోవర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. యూపీఐ సేవలకు రుసుము వసూలు చేస్తే అది పరోక్షంగా పన్ను విధించినట్లేనని వ్యాఖ్యానించారు. ఇప్పటికే విజయవంతంగా పనిచేస్తున్న వ్యవస్థలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు వస్తే ప్రజలు, వ్యాపారులు మళ్లీ నగదు వైపు మళ్లే అవకాశం ఉందని గ్రోవర్ హెచ్చరించారు. దీనివల్ల బ్యాంకులు, వ్యాపార సంస్థలకు నగదు నిర్వహణ ఖర్చులు పెరుగుతాయని చెప్పారు. చివరికి భారత్ మళ్లీ నగదు ఆధారిత ఆర్థిక వ్యవస్థగా మారే పరిస్థితి రావచ్చన్నారు. ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం.. రూ.2,000 వరకు యూపీఐ లావాదేవీలపై బ్యాంకులు, చెల్లింపు సంస్థలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎలాంటి ఛార్జీలు విధించకూడదు. రూపే డెబిట్ కార్డు చెల్లింపులకూ ఇదే నిబంధన వర్తిస్తుంది. అయితే రూ.2,000 దాటిన యూపీఐ లావాదేవీలపై, ముఖ్యంగా వ్యాపారుల చెల్లింపుల విషయంలో ఛార్జీలు విధించే అవకాశం ఉందా అన్నది నోటిఫికేషన్‌లో స్పష్టంగా లేదు. ప్రస్తుతం లావాదేవీ విలువతో సంబంధం లేకుండా యూపీఐపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) లేదు. అయితే రూ.2,000 పరిమితి ఎందుకు పెట్టారన్నదే తన ప్రశ్న అని గ్రోవర్ అన్నారు. రూ.2,000 కంటే ఎక్కువ లావాదేవీలు మొత్తం లావాదేవీల్లో పరిమాణం పరంగా కేవలం 4 శాతమే అయినా.. మొత్తం విలువలో వాటి వాటా 66 శాతంగా ఉందని పేర్కొన్నారు. పెద్ద మొత్తాల యూపీఐ చెల్లింపులపై ఎండీఆర్ విధిస్తే ఆ భారాన్ని వ్యాపారులు వినియోగదారులపై మోపే అవకాశం ఉందని గ్రోవర్ చెప్పారు. లేదంటే ఒకేసారి రూ.12,000 చెల్లించాల్సిన చోట రూ.2,000 చొప్పున పలుమార్లు చెల్లించే పరిస్థితి రావచ్చన్నారు. అదే సమయంలో దుకాణదారులు రూ.2,000 కంటే ఎక్కువ యూపీఐ చెల్లింపులను స్వీకరించకుండా నగదు అడిగే అవకాశం ఉందని చెప్పారు. అప్పుడు నగదు అవసరం పెరుగుతుంది. మరిన్ని ఏటీఎంలు, నగదు నిర్వహణ కేంద్రాలు అవసరమవుతాయని తెలిపారు. యూపీఐపై ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ వల్ల అసలు ఎవరికి నష్టం జరుగుతోందో చెప్పాలని గ్రోవర్ ప్రశ్నించారు. రిజర్వ్ బ్యాంక్ నుంచి ప్రభుత్వానికి రూ.2.87 లక్షల కోట్ల మిగులు బదిలీ జరిగిందని, లిస్టెడ్ బ్యాంకుల మొత్తం లాభాలు రూ.4.11 లక్షల కోట్లుగా ఉన్నాయని గుర్తుచేశారు. ఎన్‌పీసీఐ ప్రీ-ట్యాక్స్ మిగులు కూడా రూ.1,888 కోట్లుగా ఉందని పేర్కొన్నారు.

## ఉద్యోగులతో పెట్టుకుంటున్నారు.
# కాంగ్రెస్ ఓటమి ఖాయం: కవిత

హైదరాబాద్: ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పెట్టుకున్న ప్రభుత్వాలు మళ్లీ అధికారంలోకి వచ్చిన దాఖలాలు లేవని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. వారిని చిన్నచూపు చూస్తూ నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోవడం ఖాయమని వ్యాఖ్యానించారు. తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఉద్యోగులను రాష్ట్ర అభివృద్ధిలో కీలక భాగస్వాములుగా చూస్తామని కవిత చెప్పారు. ఉద్యోగులను గౌరవించేలా, వారు సంతోషంగా పనిచేసేలా తమ ప్రభుత్వం విధానాలు రూపొందిస్తుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉపాధ్యాయులు ఉద్యోగం కన్నా ఉద్యమానికే ప్రాధాన్యం ఇచ్చి పోరాడారని కవిత గుర్తు చేశారు. రాష్ట్రంలో 630 మండలాలకు కేవలం ఎనిమిది మంది పర్మినెంట్ మండల విద్యాధికారులు (ఎంఈవోలు) ఉండటం విద్యా వ్యవస్థపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ఉచిత, నాణ్యమైన విద్య అందాలంటే బలమైన యంత్రాంగం అవసరమని అన్నారు. విద్యార్థుల వివరాలు, రిపోర్టుల పేరుతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. ఒక్క ఉపాధ్యాయుడితో నడుస్తున్న పాఠశాలల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. ఉద్యోగుల సహకారం లేకుండా ప్రభుత్వం ఏ కార్యక్రమాన్నీ సమర్థంగా అమలు చేయలేదని కవిత అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు కూడా ఆశించిన స్థాయిలో లేదని విమర్శించారు. మైకుల ముందు ఎన్ని గొప్పలు చెప్పినా పెన్షన్లు, యూరియా, రైతులకు విద్యుత్ అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల ముందు పీఆర్సీ, డీఏలు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటివరకు వాటిపై స్పందించలేదని అన్నారు.

## ఏపీలో నిరుద్యోగులకు గుడ్‌న్యూస్..
# 892 పోస్టులకు ఏపీపీఎస్సీ నోటిఫికేషన్లు

అమరావతి: ఏపీలో నిరుద్యోగులకు గుడ్‌న్యూస్. వివిధ శాఖల్లో మొత్తం 892 పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ వేర్వేరుగా నోటిఫికేషన్లు జారీ చేసింది. వీటిలో 163 పోస్టులతో గ్రూప్-1 నోటిఫికేషన్ కూడా ఉంది. ఈ మేరకు వివరాలను ఏపీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. గ్రూప్-1 పోస్టులకు అక్టోబర్ 6 నుంచి 27 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. దీని ద్వారా భర్తీ చేయనున్న వాటిలో డిప్యూటీ కలెక్టర్లు 11, ట్యాక్స్ సర్వీసెస్ అసిస్టెంట్ కమిషనర్లు 14, డీఎస్పీ సివిల్ 36, డీఎస్పీ కమ్యూనికేషన్స్ 3, డీఈవోలు 14, ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్లు 1, ఆర్టీవోలు 3, డిప్యూటీ రిజిస్టర్ కోఆపరేటివ్ సర్వీసెస్ 15, మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-2 పోస్టులు 12, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ 2, డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ 3, అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ 14, డివిజినల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ 35 పోస్టులు ఉన్నాయి. మిగిలిన 729 పోస్టుల భర్తీకి అర్హత, నియామక పరీక్షల వివరాలు, ఇతర అంశాలను ఏపీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. వీటి కోసం అక్టోబర్ 16 నుంచి నవంబర్ 5 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు.

## తాడేపల్లి క్షిప్ర గణపతి ఆలయంలో వినాయక సంబరాలలో పాల్గొన్న జనసేన ప్రెసిడెంట్



అంబటి నేటి శుభోదయ తాడేపల్లి 15 సెప్టెంబర్: తాడేపల్లి మహానాడు ఏరియాలో వేంచేసియున్న క్షిప్ర గణపతి ఆలయంలో వినాయక సంబరాలు ఘనంగా జరిగాయి 16 సంవత్సరాల నుంచి గుడి కట్టిన దగ్గర నుంచి ఇప్పటివరకు ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా ఇక్కడ వినాయక ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో జనసేన తాడేపల్లి ప్రెసిడెంట్ అంబటి తిరుపతి రావు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు ఆయన మాట్లాడుతూ ఈ గుడిని సందర్శించటం ఎంతో ఆనందంగా ఉందని గుడికి సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ ఆలయం యొక్క విశిష్టత ఈ ఆలయ చైర్మన్ ఆదిశేషు వాస్తు సిద్ధాంతి ఆయనకు కలలో స్వామివారు సాక్షాత్కరించి ఈ ఆలయ నిర్మాణం చేయాలని ఆదేశించారు గణపతి మండపంలో లడ్డుబాట ప్రతి సంవత్సరం విశేషత సంతరించుకుంటుంది ఈ స్వామివారి వద్ద లడ్డు పాట పాడిన వ్యక్తులకు వారి కోరిన కోరికలు నెరవేరటమే కాకుండా సంవత్సరంలోపు ఉన్న అప్పులు తీరిపోయి కొత్త ఇల్లు కట్టుకుని ఆచారం కొనసాగుతుంది ఈ సంవత్సరం లడ్డుపాటకు విశేష స్పందన లభిస్తుందని నిర్వాహకులు ఆశిస్తున్నారు అన్నదానం ఆదివారం జరుగుతుంది సోమవారం లడ్డుపాట సాయంత్రం మూడు గంటలకు జరుగుతుంది ఆసక్తి కలిగిన వారు 8977512999 ఈ నెంబర్లో సంప్రదించాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమాన్ని అద్యంతం నిర్వహించే కమిటీ మెంబర్స్ తమ్మిశెట్టి ఆదిశేషు దిబ్బమడుగు వెంకటనారాయణ ఎర్రగొండ బాలయ్య ను సుమ చెన్నై బందారు వెంకటరమణ పెద్ద గోపు రాంప్రసాద్ ఆకుల మురళీకృష్ణ కైపు జనార్ధన్ రెడ్డి ఎన్ వెంకటేష్ ప్రసాద్ డి జగదీష్ శివారెడ్డి వేంపాటి అల్లురెడ్డి బత్తుల దుర్గారావు జే కొండల్ ఆకుల శివరామకృష్ణ జయ బాబు గుంటుపల్లి నరేంద్ర కుమార్ పాల్గొన్నారు లడ్డు పాటకు పుర ప్రముఖులందరూ విచ్చేస్తారని కమిటీ వారు ఆశిస్తున్నారు.

## నిరుపేదలకు సొంత స్థలం కల్పించడమే లక్ష్యం

### ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



అమరావతి, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ ::: ఆంధ్రప్రదేశ్‌లోని నిరుపేద కుటుంబాలకు సొంత స్థలం కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఒక బృహత్తర నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన సుమారు 1,25,000 (లక్షా 25 వేల) మంది పేదలకు ఉచితంగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేసేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. పండుగ కానుకగా పేదలకు ఈ పట్టాలను అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నిర్ణయించడంతో లబ్ధిదారుల్లో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

**- పూర్తిస్థాయి యాజమాన్య హక్కులు**

**పక్కా రిజిస్ట్రేషన్ విధానం**

గతంలో మాదిరిగా నామమాత్రపు కాగితాలు కాకుండా, లబ్ధిదారులకు శాశ్వత యాజమాన్య హక్కులు కల్పించేలా అధికారిక రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేయాలని రెవెన్యూ శాఖ నిర్ణయించింది. మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ కుటుంబంలోని మహిళల పేరిటే ఈ పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాగనుంది. లబ్ధిదారులు ఈ స్థలాలపై భవిష్యత్తులో గృహ నిర్మాణ రుణాలు పొందేందుకు, అన్ని రకాల బ్యాంకింగ్ సదుపాయాలు పొందేందుకు వీలుగా చట్టపరమైన పత్రాలను రూపొందిస్తున్నారు.

**- లేఅవుట్లలో మౌలిక సదుపాయాల కల్పన**

కేవలం భూమిని కేటాయించి వదిలేయకుండా, పట్టాలు ఇచ్చిన లేఅవుట్లలో అన్ని రకాల ప్రాథమిక మౌలిక వసతులు ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ప్రతి లేఅవుట్‌లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి పైప్‌లైన్లు, విద్యుద్దీకరణ సదుపాయాలను సమకూర్చనున్నారు. పట్టా చేతికి అందిన వెంటనే పేదలు తమ స్థలాల్లో గృహ నిర్మాణాన్ని ప్రారంభించుకునేందుకు తగిన సహాయ సహకారాలను అందించేలా పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి.

**వివాదరహిత భూముల ఎంపిక -- క్షేత్రస్థాయి పరిశీలన**

ఇళ్ల స్థలాల కేటాయింపులో న్యాయపరమైన చిక్కులు, సరిహద్దు వివాదాలు లేకుండా ఉండేందుకు జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పకడ్బందీ సర్వే నిర్వహించారు. ప్రభుత్వ భూములు, గతంలో సేకరించిన నిరుపయోగ భూములను గుర్తించి సరిహద్దులు నిర్ధారించారు. ఎటువంటి కోర్టు వివాదాలు లేని స్థలాలనే లబ్ధిదారులకు కేటాయించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా లబ్ధిదారుల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హుల జాబితాలను తుది విడతగా రూపొందించారు.ప్రభుత్వ సేవలు పొందండి

**- పేదల ఆత్మగౌరవం**

**- ఆర్థిక సాధికారతకు బాటలు**

సొంతింటి స్థలం అనేది నిరుపేద కుటుంబానికి కొండంత సామాజిక రక్షణ, ఆత్మగౌరవాన్ని కల్పిస్తుంది. లక్షా 25 వేల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు దక్కడం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో పేదరిక నిర్మూలనకు గట్టి పునాది పడనుంది. పారదర్శకమైన రీతిలో అర్హులందరికీ నేరుగా పట్టాలు అందించడం ద్వారా కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీని నెరవేరుస్తూ పేదల సొంతింటి కలను సాకారం చేస్తోంది.

## ఆళ్ళ నాని ఆకస్మిక మృతి పట్ల పులి శ్రీరాములు సంతాపం



ఏలూరు, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ ::: మాజీ ఉప ముఖ్య మంత్రి ఆళ్ళ కాళీకృష్ణ శ్రీనివాస్ నాని ఆకస్మిక మృతి పట్ల కేంద్ర ప్రభుత్వ టిఎసి మాజీ సభ్యులు పులి శ్రీరాములు సంతాపం ప్రకటించారు. అందరితో మంచిగా ఉంటూ, వివాదాలకు దూరంగా ఉండే ఆళ్ళ నాని మరణం హృదయాన్ని కలచి వేసిందన్నారు. కోవిడ్ సమయంలో ఆరోగ్య శాఖ మంత్రిగా ఉండి ,తన పదవిని సమర్థవంతంగా నిర్వహించారని అన్నారు. ఆళ్ళ నాని మరణం రాష్ట్ర రాజకీయాలకు తీరని లోటు అన్నారు. నాని కుటుంబ సభ్యులకు పులి శ్రీరాములు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## చింతూరు ప్రీమియం లీగ్ మ్యాచ్ ( సి పి ఎల్ ) డిసెంబర్ లో ప్రారంభం



చింతూరు, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ ::: చింతూరు ప్రీమియర్ లీగ్ సి పి ఎల్ 3 క్రికెట్ టోర్నమెంట్ డిసెంబర్ నెలలో ప్రారంభం కానున్నదని అసోసియేషన్ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ టోర్నమెంట్ ఐపీఎల్ తరహాలో వైట్ లెదర్ బాల్ తో లీగ్స్ పద్ధతిలో నిర్వహించబడుతుందని నిర్వాహకులు తెలిపారు.టోర్నమెంట్ లో 12 టీమ్స్ కు మాత్రమే అవకాశం ఉంటుందని తెలియజేశారు. ఈ టోర్నమెంట్ లో పాల్గొనే క్రీడాకారులు పోలవరం జిల్లాకు చెందిన వారు మాత్రమే పాల్గొనాలని సూచించారు.టోర్నమెంట్ ఆడదలచిన క్రీడాకారులు అప్లికేషన్ పెట్టి వారి పేరు నమోదు చేసుకున్న తర్వాతనే క్రీడాకారులకు ఈ టోర్నమెంట్ లో ఆడే అవకాశం ఉంటుందని తెలిపారు.టోర్నమెంట్ లో ప్లేయర్స్ వేలంపాట,ఆన్లైన్ స్కోరింగ్ ఉంటుందని తెలిపారు. ప్రతి జట్టు సొంత క్రికెట్ కిట్ ను కలిగి ఉండాలని, ఈ లీగ్లో పాల్గొనదలచిన టీమ్స్ ఈనెల 30వ తేదీ లోగా దరఖాస్తు నమోదు చేసుకోవాలని తెలియజేశారు. అలాగే క్రీడాకారులు కూడా అప్లికేషన్ ఈనెల 16వ తేదీ నుండి అక్టోబర్ 14వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. క్రీడాకారుల వేలంపాట అనంతరం ఈ క్రికెట్ టోర్నమెంట్ డిసెంబర్ లో ప్రారంభం కానున్నదని తెలిపారు.ఈ టోర్నమెంట్ పోలవరం జిల్లా ఏజెన్సీలోని క్రీడాకారుల ప్రతిభను వెలికి తీయడానికి ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ టోర్నమెంట్ లో పాల్గొనదలచిన వారు 7995885866, 8179340124,8985277587,703664332 4 నెంబర్ లను సంప్రదించాలని తెలిపారు.

## ప్రజలు నరకం చూస్తున్నారు అధికారులు పాలకులు చోద్యం చూస్తున్నారు

### – బీసీ ఎస్టీ కాలనీల రోడ్ల దుస్థితిపై మండిపడుతున్న ప్రజానీకం



చింతూరు, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ ::: పోలవరం జిల్లా చింతూరు డివిజన్ కేంద్రంలోని బీసీ ఎస్టీ కాలనీలలో రోడ్ల పరిస్థితి దయనీయంగా ఉంది. 20 సంవత్సరాలుగా రోడ్డు సౌకర్యం లేక ప్రజలు అల్లాడుతున్న కానీ పట్టించుకునే నాథుడే కరువైనాడు. సాయిబాబా గుడి నుండి గొల్ల బజారు మీదుగా వాళ్ళ బజారు వరకు రోడ్డు అత్యంత దుర్భరంగా ఉన్న కానీ స్థానిక అధికారులు ప్రజాప్రతినిధులు అధికార పార్టీ నాయకులు కూడా పట్టించుకోకుండా వ్యవహరించటంపై ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు.రామాలయం నుండి ఎస్టీ కాలనీ వరకు ఉన్న రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారి ప్రజలకు నరకం చూపిస్తుంది. పాలకులు మారుతున్నారు ప్రభుత్వాలు మారుతున్నాయి ఈ కాలనీవాసుల సమస్యలు మాత్రం మారడం లేదు. చింతూరు డివిజన్ కేంద్రంలోని ఉన్నతాధికారులు ఉన్న కానీ అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు ఎస్టీ బీసీ కాలనీవాసుల పరిస్థితి నెలకొంది.పోలవరం పేరుతో తమ కాలనీలకు రోడ్లు వేయడం లేదని ప్రజలు అనుకుంటున్నారు. కనీసం ఈ ప్రాంతం ఖాళీ చేసి వెళ్లే వరకు సుమారు రెండు సంవత్సరాలు పైగానే పడుతుంది అప్పటివరకు ఈ నరకం అనుభవించాల్సిందేనా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు పనికి వెళ్లే పెద్దలు వ్యాపారులు వాహనదారులు తిట్టుకుంటూ



చీదరించుకుంటూ ఇటు అధికారులను అటు పాలకుల నిర్లక్ష్య వైఖరికి నిందిస్తున్నారు.డ్రైనేజీ వ్యవస్థ కూడా అంతంతమాత్రంగానే ఉండటంతో ప్రమాదకరమైన దోమలు వృద్ధి చెంది ప్రజా ఆరోగ్యం ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా తమ కాలనీవాసులను పట్టించుకోకపోతే రానున్న స్థానిక ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పటం ఖాయమని పలువురు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## ప్రభుత్వ పాఠశాలలలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల షెడ్యూల్ విడుదల




చింతూరు, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ ::: చింతూరు మండలంలోని 103 ప్రభుత్వ యాజమాన్యం ( జిల్లా పరిషత్,ఎంపీపీ ,జీపీస్ , ఏ హెచ్ ఎస్ , ఏపీ ఆర్ ఎస్ ,కేజీబీవీ , ఈ ఎం ఆర్ ఎస్ ) పాఠశాలల్లో ఈనెల 29వ తేదీన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించడానికి షెడ్యూలు విడుదలయిందని మండల విద్యాశాఖ అధికారి జి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 18వ తేదీన పాఠశాలలలో ఓటర్ లిస్ట్ ప్రకటన , 25వ తేదీన అభ్యంతరాల స్వీకరణ, తుది జాబితా విడుదల, 29వ తేదీన ఎన్నికల నిర్వహణ, ఎన్నుకోబడిన సభ్యుల చేత ప్రమాణ స్వీకారం కార్యక్రమాలు నిర్వహించబడతాయని యం ఈ ఓ తెలియజేశారు.

## ఆళ్ల నాని మృతి పట్ల ఎంపీ పుట్టా మహేష్ కుమార్ దిగ్భ్రాంతి

ఏలూరు, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :: ఏలూరు మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ (నాని) ఆకస్మిక మృతి పట్ల ఎంపీ పుట్టా మహేష్ కుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు మీడియాకు ఎంపీ ఒక ప్రకటన విడుదల చేశారు. ఆళ్ల నాని మృతి ఏలూరు ప్రజలకు తీరని లోటు అన్న ఎంపీ, నాని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. 2004 లో మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి రెండు దశాబ్దాలకు పైగా ఏలూరుతో పాటు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రాజకీయాల్లో, ప్రజాసేవలో ఆళ్ల నాని తనదైన ముద్ర వేశారని చెప్పారు. ఈ క్లిష్ట సమయంలో వారి కుటుంబ సభ్యులకు ధైర్యం, మనోబలం కలగాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆకాంక్షించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు ఎంపీ తెలిపారు.

## అనంతపురం నగరపాలక సంస్థలో ఘనంగా 'ఇంజనీర్స్ డే' వేడుకలు

### భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు నివాళులు



అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 15 నేటి శుభోదయ : భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య 166వ జయంతి (ఇంజనీర్స్ డే)లి వేడుకలను అనంతపురం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఈరోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అధికారులు, సిబ్బంది ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా నగరపాలక సంస్థ కమిషనర్ జశ్వంత రావు మాట్లాడుతూ.. మోక్షగుండం విశ్వేశ్వరయ్య సివిల్ ఇంజనీరింగ్ రంగంలో దేశానికి అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. నగరపాలక సంస్థలో పనిచేస్తున్న ఇంజనీర్లందరూ ఆయనను ఆదర్శంగా తీసుకుని, అంకితభావంతో పనిచేస్తూ నగరపాలక సంస్థకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం పలువురు ఇంజనీరింగ్ అధికారులు విశ్వేశ్వరయ్య సేవలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అంజయ్య, ఎస్.ఈ రాజశేఖర్, ఈ.ఈ షాకీర్ హుస్సేన్, డీ.ఈ.ఈలు దాక్షాయణి, సత్యనారాయణ, ఇంచార్జ్ ఏ.ఈ లు ముఖేష్, భగీరథ రెడ్డి, చక్రవర్తి, నవీన్, దినేష్ ఇతర ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆళ్ల నాని మృతి పట్ల ఎంపీ పుట్టా మహేష్ కుమార్ దిగ్భ్రాంతి



ఏలూరు, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ ::: ఏలూరు మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ (నాని) ఆకస్మిక మృతి పట్ల ఎంపీ పుట్టా మహేష్ కుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు మీడియాకు ఎంపీ ఒక ప్రకటన విడుదల చేశారు. ఆళ్ల నాని మృతి ఏలూరు ప్రజలకు తీరని లోటు అన్న ఎంపీ, నాని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. 2004 లో మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి రెండు దశాబ్దాలకు పైగా ఏలూరుతో పాటు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రాజకీయాల్లో, ప్రజాసేవలో ఆళ్ల నాని తనదైన ముద్ర వేశారని చెప్పారు. ఈ క్లిష్ట సమయంలో వారి కుటుంబ సభ్యులకు ధైర్యం, మనోబలం కలగాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆకాంక్షించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు ఎంపీ తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో విఘ్నేశ్వరుని నవరాత్రి ఉత్సవాలు



ఒంగోలు, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ ::: వీధి వీధిలో గణపతి నవరాత్రి ఉత్సవాలు, ఊరూ వాడా ఎంతో ఘనంగా, ఆధ్యాత్మిక శోభతో ప్రారంభమయ్యాయి. ప్రతి వీధిలోనూ విఘ్నేశ్వరుని మండపాలు వెలసి, భక్తుల కోలాహలంతో సందులన్నీ ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. వైవిధ్యమైన ప్రతిమలు, అద్భుత అవతారాలు ఈ ఏడాది ఉత్సవాల్లో భారీ విగ్రహాలతో పాటు ఎంతో వైవిధ్యమైన, సృజనాత్మక వినాయకుని రూపాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దక్షిణం బజార్: పెన్నులతో తయారు చేసిన ప్రత్యేక పెన్నుల గణపతి విద్యార్థులను, ప్రజలను ఎంతగానో ఆకర్షిస్తోంది. రంగు తోట: తల్లిదండ్రులైన శివపార్వతుల చుట్టూ భక్తితో ప్రదక్షిణ చేస్తున్న భక్తి గణపతి ప్రతిమ విశేషంగా నిలిచింది. గ్రంథాలయం వద్ద: భక్తులకు అభయమిస్తూ దర్శనమిస్తున్న అద్భుతమైన పంచముఖ గణపతి. మాతా శిశు వైద్యశాల ఎదురు: ఆధ్యాత్మిక నిలయంలా కన్నులవిందు చేస్తున్న విశిష్టమైన ఆలయ మండపం. ప్రత్యేక రూపాలు: తాబేలుపై ఆసీనుడైన గణపయ్య, ప్రకృతి సందేశాన్నిచ్చే వృక్ష గణపతి వంటి వేలాది విభిన్న రూపాల్లో లంబోదరుడు భక్తులకు దర్శనమిస్తున్నాడు.కన్నులపండువగా సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలుపురోహితుల వేద మంత్రోచ్చారణలు, దగద్ధగమనే దీప కాంతులు, విద్యుత్ దీపాల వరుసల కాంతులతో మండపాలన్నీ వెలిగిపోతున్నాయి. పూజల నిర్వహణతో పాటు శ్రావ్యమైన భక్తి గీతాల గాన మాధుర్యాలు, పురాణ ప్రవచనాలు మరియు శోభాయమానమైన కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను పరవశింపజేస్తున్నాయి.పడతుల సోయగాల అలంకరణలు, యువకుల కేరింతలు, కోలాటాలతో ఉత్సవ పరిసరాలన్నీ సందడిగా మారాయి. స్వామివారిని దర్శించుకుని తరించడానికి కుటుంబ సమేతంగా భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారు.



## ఆళ్ల నాని మృతికి 'అనంత' సంతాపం



అనంతపురం బ్యూరో సెప్టెంబర్ 15 నేటి శుభోదయ : మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని (ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్) మృతికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి సంతాపం తెలియజేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో ఆళ్ల నాని డిప్యూటీ సీఎంగా, వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా సమర్థవంతంగా పని చేశారన్నారు. మరీ ముఖ్యంగా కోవిడ్ సమయంలో ఆరోగ్యశాఖ మంత్రిగా కీలక పాత్ర పోషించారని, అనంతపురంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని కరోనా సమయంలో అందుబాటులోకి తీసుకురావడంలో ఆయన ప్రత్యేక చొరవ చూపారని గుర్తు చేసుకున్నారు. గుండెపోటుతో ఆయన హఠాన్మరణం చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని పేర్కొన్నారు. ఆళ్ల నాని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

## మాచర్లలో భక్తి సందడి.. వినాయక మండపాల్లో యాగంటి ప్రత్యేక పూజలు

### మాచర్ల ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి.కుటుంబ సమేతంగా విఘ్నేశ్వర స్వామికి పూజలు నిర్వహించిన యాగంటి మల్లికార్జునరావు



మాచర్ల : ఆర్ సి ఇన్చార్జి ఇంచార్జ్ సెప్టెంబర్ ; 15 నేటి శుభోదయ మాచర్ల: పట్టణంలోని పలు వార్డుల్లో వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు కుటుంబ సమేతంగా పలు వినాయక మండపాలను సందర్శించి విఘ్నేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.మండపాల వద్ద భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్న యాగంటి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాచర్ల నియోజకవర్గ ప్రజలందరిపై విఘ్నేశ్వర స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఆనందం వెల్లివిరియాలని కోరుకున్నారు.వినాయక ఉత్సవాలు కేవలం ఆధ్యాత్మిక వేడుకలు మాత్రమే కాకుండా ప్రజలను ఒక్కతాటిపైకి తీసుకువచ్చే ఐక్యతకు ప్రతీకలని యాగంటి పేర్కొన్నారు. మాచర్లలో భక్తి, సోదరభావం, ఐక్యత మరింత బలపడాలని ఆకాంక్షించారు.మండపాల వద్ద స్థానికులు, యువత, ఉత్సవ కమిటీ సభ్యులతో యాగంటి మల్లికార్జునరావు ఆత్మీయంగా మమేకమయ్యారు. ఆయనకు నిర్వాహకులు, స్థానికులు ఘన స్వాగతం పలికారు. ప్రజలతో కలిసిమెలిసి వారి కార్యక్రమాల్లో పాల్గొంటూ యాగంటి తనదైన శైలిలో ప్రత్యేకతను చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో శివ, యాగంటి ప్రతాప్, మాజీ కౌన్సిలర్ మంజుల వెంకటేశ్వర్లు, అల్లం వెంకటేశ్వర్‌రెడ్డి, చెన్న, బొట్టు కోటేశ్వరరావు, కృష్ణ, స్వామి, కొండలు, వెంకటేష్, శ్రీను తదితరులతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 166వ జయంతి వేడుకలు

**నిజాయితీ, దేశభక్తికి విశ్వేశ్వరయ్య ఆదర్శం: మెట్టు గోవిందరెడ్డి**



మాచర్ల :ఆర్ సి ఇన్చార్జి సెప్టెంబర్ 15 ; నేటి శుభోదయ :మాచర్ల: ప్రముఖ ఇంజనీర్, త్యాగశీలి, దేశభక్తుడు, నిజాయితీకి మారుపేరుగా నిలిచిన డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 166వ జయంతి వేడుకలను మాచర్లలో ఘనంగా నిర్వహించారు. స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాచర్ల స్వామి వివేకానంద సేవాశ్రమంలో మార్నింగ్ యోగా టీం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్, పల్నాడు జిల్లా దిశా కమిటీ సభ్యులు, మాచర్ల మండల న్యాయ సేవా కమిటీ సభ్యులు మెట్టు గోవిందరెడ్డి, యోగా బృంద సభ్యులతో కలిసి విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.అనంతరం గోవిందరెడ్డి మాట్లాడుతూ.. డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని ఇంజనీర్స్ డేగా నిర్వహించుకోవడం ఇంజనీర్లందరికీ గర్వకారణమన్నారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన విశ్వేశ్వరయ్య ప్రతికూల పరిస్థితులను అధిగమించి విద్యను అభ్యసించారని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా పట్టుదలతో ముందుకు సాగి, విద్యార్థులకు ట్యూషన్లు చెప్పి వచ్చిన ఆదాయంతో తన విద్యాభ్యాసాన్ని కొనసాగించిన మహానుభావుడని కొనియాడారు.దేశంలోని అనేక నదులపై తన ఇంజనీరింగ్ నైపుణ్యంతో ఆనకట్టలు నిర్మించి, ప్రజల అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని తెలిపారు. ప్రభుత్వ ఇంజనీర్గా పనిచేసిన సమయంలోనూ అత్యంత నిజాయితీ, నిబద్ధతతో తన బాధ్యతలను నిర్వర్తించి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు.ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో డాక్టర్ విశ్వేశ్వరయ్య చిత్రపటం ఉండాలని పలువురు మేధావులు కోరుతున్నారని గోవిందరెడ్డి తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులు, ఇంజనీర్లు ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని నిజాయితీ, క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. విశ్వేశ్వరయ్య ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేసినప్పుడే ఆయన కలలుగన్న అభివృద్ధి చెందిన నవభారత నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో అందుగుల చంద్రయ్య, ముత్యాల పాపిరెడ్డి, పి. హరిబాబు, ఉప్పుతోళ్ల వెంకటనారాయణ, ఆర్టీసీ ఉద్యోగి రాయప్ప, రాజారావు, శ్రీనివాసరావు, ఇందిరమ్మ, సుందరమ్మ, స్వరాజ్యం తదితరులతో పాటు మార్నింగ్ యోగా సభ్యులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పింఛన్ల దరఖాస్తు గడువు సెప్టెంబర్ 30 వరకు పొడిగించాలి

**తహశీల్దార్ కిరణ్‌కుమార్‌కు ప్రజాసంఘాల విజ్ఞప్తి**



మాచర్ల :ఆర్ సి ఇన్చార్జి సెప్టెంబర్ 17; నేటి శుభోదయ : ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ దళిత ప్రజాసంఘాల నాయకులు మంగళవారం మాచర్ల తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ బి. కిరణ్‌కుమార్‌ను కలిసి విజ్ఞాపన పత్రం అందజేశారు.ఈ సందర్భంగా దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు, పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ కుక్కమూడి ప్రసాద్, శ్రీ వీరబ్రహ్మేంద్ర జాతీయ ప్రజా హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గురజాల అప్పారావు మాట్లాడుతూ.. ఎన్టీఆర్ భరోసా పథకం కింద అర్హులైన వారికి కొత్త పింఛన్ల కోసం సెప్టెంబర్ 7 నుంచి 16వ తేదీ వరకు స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు.అయితే కొంతమంది అర్హులు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నప్పటికీ, మరికొందరు అర్హత ఉన్నప్పటికీ ఇంకా దరఖాస్తు చేసుకోలేకపోయారని తెలిపారు. ముఖ్యంగా సెప్టెంబర్ 12, 13, 14 తేదీల్లో వరుసగా ప్రభుత్వ సెలవులు రావడం, పలుమార్లు సర్వర్లు మొరాయించడం వంటి కారణాలతో చాలామంది అర్హులు దరఖాస్తులు నమోదు చేసుకోలేకపోయారని పేర్కొన్నారు.దీంతో అర్హులైన అనేకమంది పింఛన్లకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతోందని, ఈ సమస్య రాష్ట్రవ్యాప్తంగా ఉందని నాయకులు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించే ఉద్దేశంతో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల దరఖాస్తు గడువును సెప్టెంబర్ 30వ తేదీ వరకు పొడిగించాలని వారు కోరారు.ఈ సమస్యను ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని తహశీల్దార్‌ను విజ్ఞప్తి చేశారు. అలాగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జోక్యం చేసుకుని పింఛన్ల దరఖాస్తు గడువును పొడిగించేలా చర్యలు తీసుకోవాలని మీడియా ద్వారా కోరారు.ప్రజాసంఘాల విజ్ఞప్తిపై తహశీల్దార్ బి. కిరణ్‌కుమార్ సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. సమస్యను ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తహశీల్దార్ హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

## అనంతపురం జిల్లా ప్రజాప్రతినిధులకు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఆత్మీయ విందు

**-జిల్లా అభివృద్ధికి ప్రజాప్రతినిధుల సమన్వయం ఎంతో కీలకం**



అనంతపురం బ్యూరో సెప్టెంబర్ 15 నేటి శుభోదయ : అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ జిల్లా ప్రజాప్రతినిధులకు మంగళవారం ఆత్మీయ విందు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించిన అభివృద్ధి అంశాలు, ప్రజా సమస్యలు, స్థానిక సంస్థల ఎన్నికలు తదితర అంశాలపై ప్రజాప్రతినిధులతో ఆత్మీయంగా చర్చించారు.ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్చార్జ్ మంత్రి రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రివర్యులు టీజీ.భరత్, ప్రభుత్వ విప్ రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ.అస్మిత్ రెడ్డి, సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, స్థానిక సంస్థల ఎన్నికల అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జ్ యేసు ప్రతాప్ రెడ్డి, తదితరులు హాజరయ్యారు. ఈ ఆత్మీయ విందు కార్యక్రమం ప్రజాప్రతినిధుల మధ్య స్నేహపూర్వక వాతావరణంలో సాగింది.స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరంపై కూడా కార్యక్రమంలో చర్చ జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం, ప్రభుత్వ అభివృద్ధి , సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపై ప్రజాప్రతినిధులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.జిల్లా ప్రజాప్రతినిధుల మధ్య ఆత్మీయత, పరస్పర సహకారం, సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే విధంగా ఈ కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో కొనసాగింది. అనంతపురం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు ఆకాంక్షించారు.

## దళితుల కు స్మశాన వాటిక స్థలం కేటాయించాలని ఐ టీ డి ఎ పి ఓ కు వినతి



చింతూరు, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ ::: చింతూరులో దళితులకు స్మశాన వాటిక కేటాయించాలని చింతూరు బి ఆర్ అంబేద్కర్ దళిత సంఘ నాయకులు ఐ టి డి ఎ పి ఓ శుభమ్ నొక్వాల్ కు వినతిపత్రం ఇచ్చారు.ఆ వినతిపత్రం లో పి ఓ కు వివరిస్తూ గతంలో తమ సభ్యులు ఎవరైనా చనిపోతే శబరి నది ఒడ్డున పూడ్చి పెట్టేవారమని ఆ స్థలంప్రవాహ వేగానికి కోతకు గురైనదని, ప్రస్తుతం స్మశాన వాటిక లేనందున తమ సంఘానికి స్థలం కేటాయించాలని పత్రం ఇవ్వగా పి ఓ స్పందించి ఒక వారం లేక పది రోజుల్లో స్థలం ఇచ్చే విధంగా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు మెల్లెం నాగేంద్రం, ప్రధాన కార్యదర్శి ఇంటిసుదర్శన్ కుమార్, నాయకులు నక్క రజనీ కుమార్, ప్రసంగి తదితరులు పాల్గొన్నారు.

## “అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ పోటీల్లో ఏడిద యోహాను ప్రతిభ”



తాడేపల్లిగూడెం సెప్టెంబరు 15 (నేటి- శుభోదయ) భూపతి రాజు పాండురంగరాజు వరలక్ష్మి మెమోరియల్ 44వ ఏపీ అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ పోటీల్లో 75 సంవత్సరాల కేటగిరీలో తాడేపల్లిగూడెం కి చెందిన రిటైర్డ్ ఇరిగేషన్ ఉద్యోగి, తాడేపల్లిగూడెం ఎయిర్ స్టిక్ వాకర్స్ గ్రీన్ ఆర్మీ యాక్టివ్ మెంబర్ ఏడిద యోహాన్ ప్రతిభ కనబరిచారు. తణుకులో నిర్వహించిన ఈ క్రీడా పోటీల్లో జావలింత్రీలు మొదటి బహుమతి,, హేమర్ త్రో సిల్వర్ మెడల్, షార్ట్ పుట్ బ్రాంచ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా యోహానుకు ఏర్ స్టిక్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమల్ల సూరిబాబు, కార్యదర్శి ప్రతి శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

## “ఇంజనీరింగ్ రంగంలో మహోన్నత సేవలు అందించిన మహనీయుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య”



తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 15 (నేటి- శుభోదయ) ఇంజనీర్లకు ఆరాధ్యుడైన మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు అనిర్వచనీయమని ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్ రాష్ట్ర సంఘ కార్యనిర్వాక కార్యదర్శి సిహెచ్ వర్మ పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం, మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీర్స్ డే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అందులో భాగంగా జిల్లాలోని ఇంజనీర్లు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఇంజనీర్స్ భారత దేశానికి ఇంజనీరింగ్ రంగంలో మహోన్నత సేవలు అందించిన మహనీయుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని, ఆధునిక మైసూర్. కర్ణాటక రూప కల్పనే కాక భారత దేశంలో అనేక ప్రాంతాలలో సేవలు అందించిన భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని కొనియాడారు.165 వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇంజనీర్లుగా పనిచేసే రిటైర్ అయిన పెద్దలను సత్కరించారు. రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి త్రినాథ్ బాబు, ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విశ్వనాథరెడ్డి, సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు కే.ధణానంద్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్ క్రాస్ సొసైటీ పీఆర్వో కెవి రమణ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలు ఎంతో ధోహదపడతాయి

**- మట్టి వినాయకుని ప్రతిమలను పంపిణీ**

**చేస్తున్న మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ నిర్వాహకులు జవ్వాది సతీష్**



పెద్దకూరపాడు, సెప్టెంబర్15, నేటి శుభోదయ ::: వినాయకుని పండుగను పర్యావరణానికి అనుకూలంగా జరుపుకుందామని,ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వల్ల పర్యావరణానికి పెనుముప్పు మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ నిర్వాహకులు జవ్వాది సతీష్ అన్నారు. పెదకూరపాడులో జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ నిర్వాహకులు జవ్వాది సతీష్ సహకారంతో 500 మట్టి వినాయకుని ప్రతిమలను సోమవారం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జవ్వాది సతీష్ మాట్లాడుతూ రసాయన విగ్రహాలకు బదులుగా మట్టి గణనాధులను పూజించి భావితరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందించాలన్నారు. ఈకార్యక్రమంలో జనచైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి విజయ్ బెన్నిబాబు, కార్యదర్శి తుల్లూరి సాంబశివరావు ప్రతినిధులు కొర్లకుంట బ్రహ్మం, గుడిపూడి రాజశేఖర్, దాసరి కారుణ్య బాబు, సిహెచ్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## ‘ముక్కినాడ, రాధేయపాలెం, గాథరాడ గ్రామాల్లో బి.ఎస్.ఎన్.ఎల్. సెల్ టవర్లు ఏర్పాటు చేయండి..’!

**- బి.ఎస్.ఎం.ఎల్. జి.ఎం. కు ఎమ్మెల్యే ‘బత్తుల’ వినతి..! - త్వరలో ఆయా గ్రామాల్లో కొత్త టవర్లు వేయడానికి సానుకూలంగా స్పందించిన అధికారులు..!!**



కోరుకొండ, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); నియోజకవర్గంలో ‘ముక్కినాడ, రాధేయపాలెం, గాథరాడ గ్రామాల్లో బి.ఎస్.ఎన్.ఎల్. సెల్ టవర్లు ఏర్పాటు చేయాలని, ఆ గ్రామాల్లో ఎటువంటి నెట్వర్క్ (సెల్ ఫోన్ సిగ్నల్స్) లేకపోవడంతో ప్రజల ఇబ్బందులను గి.ఎం. కు రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ వివరించారు. సెల్ టవర్లకు కావలసిన అనుకూలమైన స్థలాన్ని, ఇతర సౌకర్యాలను కేటాయిస్తామని హామీ ఇచ్చారు. రాజానగరం ఎమ్మెల్యే బలరామకృష్ణ మంగళవారం భారత్ సంచార్ నిగం లిమిటెడ్ రాజమహేంద్రవరం ఆ సంస్థ జి.ఎం. పలివెల రాజు, డిప్యూటీ జి.ఎం.విజయ భాస్కర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు. రాజానగరం మండలం, ముక్కినాడ, రాధేయపాలెం గ్రామాల్లో మరియు కోరుకొండ మండలం, గాదరాడ గ్రామంలో కనీస సెల్ నెట్వర్క్ లేక ప్రజల ఇబ్బందులను వివరించారు. వెంటనే ఆ ప్రాంతాల్లో సెల్ టవర్లు ఏర్పాటు చేసి ప్రజలకు సెల్ఫోన్లకు మెరుగైన సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేసారు, వెంటనే సానుకూలంగా స్పందించిన జిఎం త్వరలో ఆ గ్రామాలకు వెళ్లి స్థలాలను, ఇతర సౌకర్యాలను పరిశీలించి, వెంటనే సెల్ టవర్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.



## విద్యానగర్‌లో ఘనంగా వినాయక ప్రత్యేక పూజలు

**- యెగినాటి మాధవరావు దంపతుల ఆధ్వర్యంలో విశేష పూజలు**

**- విజయవంతంగా రెండో ఏడాది ఉత్సవాలు**



ఖమ్మం, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరంలోని 58వ డివిజన్ రాపర్తినగర్-2 విద్యానగర్ కాలనీలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శ్రీ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యెగినాటి మాధవరావు, ఉమాదేవి దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారికి విశిష్ట పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు నడుమ జరిగిన పూజా కార్యక్రమానికి కాలనీ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. దీంతో విద్యానగర్ కాలనీ ఆధ్యాత్మిక సందడితో కళకళలాడింది. విద్యానగర్ కాలనీలో శ్రీ వినాయక ఉత్సవాలను రెండో సంవత్సరం కూడా ఘనంగా నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. గత ఏడాది భక్తుల నుంచి లభించిన ఆదరణతో ఈ ఏడాది మరింత ఉత్సాహంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఉత్సవాల విజయవంతానికి కాలనీ ప్రజలు, భక్తులు అందిస్తున్న సహకారం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ వినాయక ఉత్సవ కమిటీ చైర్మన్ ఎం. సింహారెడ్డి, కార్యదర్శి మందడపు శ్రీనివాసరావు, కోశాధికారి జవ్వాజి శ్రీనివాసరావుతో పాటు కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## మాల వేసుకుంటే క్లాసులోకి రానివ్వరా..

**- హార్వెస్ట్ కళాశాల యాజమాన్యం తీరుపై తీవ్ర ఆగ్రహం**

**- వినాయక మాల ధరించిన ఆరుగురు విద్యార్థులకు తరగతుల్లోకి నో ఎంట్రీ**

**విద్యార్థుల విశ్వాసాలపై ఆంక్షలా**

**- తల్లిదండ్రులు, హిందూ సంఘాల మండిపాటు**

ఖమ్మం, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ ::: విద్యార్థులు వినాయక మాల ధరించడమే నేరమా.. మాల వేసుకున్నారని తరగతి గది తలుపులు మూసేయడమేంటి? ఖమ్మం నగరంలోని మమతా రోడ్డులో ఉన్న హార్వెస్ట్ జూనియర్ కళాశాలలో చోటుచేసుకున్న ఘటన ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వినాయక చవితి సందర్భంగా వినాయక మాల ధరించి కళాశాలకు వచ్చిన ఆరుగురు విద్యార్థులను తరగతుల్లోకి అనుమతించలేదని ఆరోపణలు వెల్లువెత్తాయి.విద్యార్థులు మాలను తొలగించిన తర్వాతే తరగతులకు అనుమతిస్తామని యాజమాన్యం చెప్పినట్లు విద్యార్థుల కుటుంబ సభ్యులు ఆరోపించారు. దీంతో విషయం కాస్తా తల్లిదండ్రుల ఆగ్రహానికి, ఆ తర్వాత హిందూ సంఘాల ఆందోళనకు దారితీసింది. చదువుకునే విద్యార్థులపై క్రమశిక్షణ పేరుతో నిబంధనలు విధించడం ఒక ఎత్తయితే.. వారి మత విశ్వాసాలకు సంబంధించిన అంశాల్లో యాజమాన్యం జోక్యం చేసుకోవడంపై తల్లిదండ్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. విద్యార్థులు మాల ధరించడం వల్ల విద్యాభ్యాసానికి కలిగే ఇబ్బంది ఏమిటని వారు ప్రశ్నించారు విషయం బయటకు రావడంతో విద్యార్థుల కుటుంబ సభ్యులతో పాటు బీజేపీ, ఏబీవీపీ, హిందూ సంఘాల ప్రతినిధులు కళాశాల వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. విద్యార్థులను వెంటనే తరగతులకు అనుమతించాలని డిమాండ్ చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు కూడా అక్కడికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. ఆందోళన ఉధృతం కావడంతో చివరకు విద్యార్థులను తరగతుల్లోకి అనుమతించినట్లు సమాచారం. దీంతో ముందు నిబంధనల పేరుతో అడ్డుకోవడం ఆందోళన మొదలైన తర్వాత అనుమతించడం వెనుక అసలు కారణమేంటి అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.కళాశాల యాజమాన్యం సమాధానం చెప్పాల్సిందే అంటూ పలు సంఘాలు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థులపై తీసుకున్న చర్యకు కారణమేంటి మాల ధరించడం కళాశాల నిబంధనలకు విరుద్ధమైతే ఆ నిబంధనలను ముందుగానే విద్యార్థులకు ఎందుకు స్పష్టం చేయలేదనీ ప్రశ్నలు గుప్పిస్తున్నారు. ఒకే ఘటనపై ఆందోళన తర్వాత నిర్ణయం ఎందుకు మారింది చెప్పాలని యాజమాన్యం స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉందని పలువురు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థులకు విద్య అందించాల్సిన విద్యాసంస్థల్లో వివాదాలకు తావులేకుండా, అన్ని వర్గాల విశ్వాసాలను గౌరవిస్తూ వ్యవహరించాల్సిన బాధ్యత యాజమాన్యాలపై ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై హార్వెస్ట్ కళాశాల యాజమాన్యం వివరణ ఇవ్వాలని హిందూ సంఘాలు డిమాండ్ చేశాయి.

## ఇంద్రకీలాద్రిపై శ్రవణానందంగా ‘సంప్రదాయ నాదస్వర కచేరి’




విజయవాడ, సెప్టెంబర్ 15 (నేటి శుభోదయ):-విజయవాడ ఇంద్రకీలాద్రి పై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ప్రాంగణంలోని కళావేదికపై మంగళవారం సాయంత్రం దేవస్థాన నాదస్వర బృందం నిర్వహించిన ‘సంప్రదాయ నాదస్వర వాద్య కచేరి’ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.రానున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల నేపథ్యంలో, సనాతన ధర్మ సంస్కృతిని ప్రతిబింబిస్తూ దసరా నగరోత్సవ సంప్రదాయ వస్త్రధారణతో నాదస్వర కళాకారులు ఈ సంగీత విభావరిని నిర్వహించారు. సాయంత్రం 4:00 గంటల నుండి 5.30 వరకు సాగిన ఈ మంగళవాద్య ప్రదర్శన ఇంద్రకీలాద్రిపై ఆధ్యాత్మిక శోభను నింపింది.ఇలా మొత్తం నాద స్వర బృందం కార్యక్రమంలో పాల్గొవడం దేవస్థానం చరిత్రలో ఇదే మొదటి సారి అని సిబ్బంది పేర్కొన్నారు.నాదస్వర విద్వాంసులు శాస్త్రీయ కర్ణాటక సంగీత దిగ్గజాల ప్రసిద్ధ కీర్తనలను సుస్వరాలతో ఆలపించి భక్తజనాన్ని మంత్రముగ్ధులను చేశారు.వాతాపి గణపతిం / తొలుత విఘ్నేశ్వరుని స్తుతిస్తూ ప్రదర్శనను శాస్త్రోక్తంగా ప్రారంభించారు.శ్రావ్యమైన లయతో శ్రోతలను అలరించిన నాదస్వర విన్యాసం. త్యాగరాజ స్వామి విరచిత ప్రసిద్ధ కృతిని నాదస్వరంలో అద్భుతంగా పలికించారు. వేగవంతమైన స్వరకల్పనతో సాగిన పటనం భక్తులను కట్టిపడేసింది. జగన్మాత కనకదుర్గమ్మ వైభవాన్ని చాటేలా భక్తిభావంతో సాగిన ఆలాపన.త్యాగరాజ పంచరత్న కీర్తనతో కచేరిని పరిపూర్ణ ఆధ్యాత్మిక ముగింపునకు తెచ్చారు. ఈ సంప్రదాయ నాదస్వర కచేరిని దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), ఆలయ ఈవో వి.కె. శీనా నాయక్ ఆద్యంతం ఆసక్తిగా తిలకించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన నాదస్వర, వాద్య కళాకారులను ప్రత్యేకంగా అభినందించారు. ఆలయ మర్యాదల ప్రకారం కళాకారులకు శాలువాలు కప్పి, శ్రీ అమ్మవారి ప్రసాదాలు అందజేసి ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని నాదస్వరామృతాన్ని ఆస్వాదించారు.

## హోటల్ వసంత్ మార్గలో అగ్నిమాపక భద్రతా ప్రమాణాలపై ఆకస్మిక తనిఖీ



విజయవాడ, సెప్టెంబర్ 15 (నేటి శుభోదయ):-విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం రీజినల్ ఫైర్ ఆఫీసర్ సి.హెచ్. రత్నబాబు తమ సిబ్బందితో కలిసి లబ్బీపేటలోని హోటల్ వసంత్ మార్గలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో హోటల్‌కు ఫైర్ ఎన్ఓసీ (అగ్నిమాపక అనుమతి పత్రం) లేదని గుర్తించారు. అదేవిధంగా, హోటల్‌లో అందుబాటులో ఉన్న కొన్ని అగ్నిమాపక పరికరాలు సైతం పనిచేయని స్థితిలో ఉన్నట్లు అధికారులు గమనించారు. ఈ నేపథ్యంలో హోటల్ యాజమాన్యానికి వారం రోజుల గడువు విధించి, ఆలోగా అవసరమైన అగ్నిమాపక భద్రతా చర్యలను పూర్తిచేయాలని, అన్ని ఫైర్ సేఫ్టీ పరికరాలను పనిచేసే స్థితిలో ఉంచాలని ఆదేశించారు.జనసాంద్రత అధికంగా ఉండే ప్రాంతంలో హోటల్ నిర్వహిస్తున్నందున అగ్నిమాపక భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు స్పష్టం చేశారు. నిర్ణయించిన గడువులోగా లోపాలను సరిదిద్దకపోతే నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హోటల్ యాజమాన్యాన్ని హెచ్చరించారు.ఈ తనిఖీల్లో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జన ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు

### వియంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, సెప్టెంబర్ 15 (నేటి శుభోదయ):- వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా నగరంలోని వివిధ నిమజ్జన ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టినట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. నిమజ్జన ప్రాంతాల్లో పూజా వ్యర్థాలను ఎప్పటికప్పుడు సేకరించి, వేరుచేసేందుకు ప్రత్యేక పారిశుధ్య సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు. ప్రకాశం బ్యారేజ్ 2 క్రేన్లు ఏర్పాటుచేసి వినాయకుని నిమజ్జనం చేస్తున్నామని తెలిపారు, 12 మంది పారిశుధ్య కార్మికులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి, నిమజ్జనం సందర్భంగా వచ్చే పూలు, పూజా సామగ్రి తదితర వ్యర్థాలను ఎప్పటికప్పుడు వేరుచేసి సేకరిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పున్నమి ఘాట్ వద్ద 10 మంది, భవానీ ఘాట్ వద్ద 10 మంది పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నగరంలోని వివిధ నిమజ్జన ప్రాంతాల్లో పూజా వ్యర్థాల నిర్వహణను పర్యవేక్షించేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్లు నిరంతరం పర్యటిస్తున్నాయని కమిషనర్ తెలిపారు. ఇప్పటివరకు సుమారు 15,000 కేజీల పూజా వ్యర్థాలను సేకరించినట్లు వెల్లడించారు. అంతేకాకుండా నగరంలోని కాలువల వద్ద బ్యారిగేట్లను ఏర్పాటు చేసి, ప్రజలు నీటిలో ఎలాంటి పూజా వ్యర్థాలను వేయకుండా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. నీటిలో అనుకోకుండా కలిసిపోయిన వ్యర్థాలను కూడా ట్రక్సర్ మెషిన్ల సహాయంతో ఎప్పటికప్పుడు తొలగిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. సేకరించిన పూల వ్యర్థాలను వినియోగించి అగరబత్తులు, ధూప్ స్టిక్స్ వంటి ఉత్పత్తులను తయారు చేయడంతో పాటు, ఇతర పూజా వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో ప్రాసెస్ చేసి సేంద్రియ ఎరువుల తయారీకి వినియోగిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. వినాయక నిమజ్జనం సందర్భంగా భక్తులు పూజా వ్యర్థాలను కాలువలు, జల వనరుల్లో వేయకుండా నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన సిబ్బందికి అందజేసి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కమిషనర్ ధ్యానచంద్ర విజ్ఞప్తి చేశారు.

## శ్రీ లక్ష్మీ గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఘనంగా 8వ గణపతి మహోత్సవాలు పాల్గొన్న ఎమ్మెల్యే బొండా ఉమా



విజయవాడ, సెప్టెంబర్ 15 (నేటి శుభోదయ):-64వ డివిజన్ లోని కండ్రికలో శ్రీ లక్ష్మీ గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో 8వ గణపతి మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలలో ముఖ్య అతిథిగా సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. శ్రీలక్ష్మీ గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ నిర్వాహకులు కాకొల్లు రవికుమార్ , సభ్యులు ఎమ్మెల్యేకు మేళ తాళాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొండా ఉమా వినాయకుని కి పట్టు వస్త్రాలు సమర్పించి, స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఉమా మాట్లాడుతూ శ్రీ సిద్ధిబుద్ధి సమేత శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి చవితి నవరాత్రి ఉత్సవాలను శ్రీ లక్ష్మీగణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆర్గనైజర్ కె.రవికుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ నుండి 23వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 7.30 నిమిషాలకు ప్రాతఃకాల పూజ, 10గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. హిందువులు పరమ పవిత్రంగా పూజించే ఘన నాధుని పండుగను దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా కూడా అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం తరుపున చవితి పందిళ్లకు ఉచిత కరెంట్, పర్మిషన్లు ఇస్తున్నామని, అన్ని మతాలను సమానంగా చూడడమే తమ అభిమతం అని ఉమా అన్నారు. శ్రీ లక్ష్మీగణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆర్గనైజర్ కె.రవికుమార్ అధ్వర్యంలో 8సంవత్సరాల నుండి చవితి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారని అన్నారు. స్వామివారికి పూజా కార్యక్రమాలతో పాటు ప్రతి రోజూ మధ్యాహ్నం 12గంటల నుండి భక్తులకు నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. స్వామి వారి సేవకు శ్రీ లక్ష్మీ గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ కమిటీ సభ్యులు, అనేక మంది దాతలు, సహాయ సహకారాలు అందిస్తున్నారని శ్రీ లక్ష్మీ గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ నిర్వహకులు కె. రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లు మహేష్, పొలిశెట్టి చంద్ర శేఖర్, పల్లెల రవి, అల్లు నరేంద్ర,తోట సత్యనారాయణ,తోట వెంకట ప్రసాద్,పట్టేం శెట్టి నాగమణి,ఇ. హరికృష్ణ రెడ్డి, స్థానిక భక్తులు తదితరులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పండుగలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న కూటమి ప్రభుత్వం

### వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ సరఫరా ఎమ్మెల్యే గద్దె



విజయవాడ, సెప్టెంబర్ 15 (నేటి శుభోదయ):- మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు అయిన పండుగలకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. తూర్పు లో సోమవారం జరిగిన వినాయక చవితి వేడుకల్లో ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పాల్గొని పూజలు చేశారు. గద్దె తో పాటు మాజీ కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సంద్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వినాయక చవితి పండుగ సందర్భంగా భక్తులు ఏర్పాటు చేసుకునే వినాయక మండపాలకు, పందిళ్ళకు విద్యుత్‌ను తమ కూటమి ప్రభుత్వం ఉచితంగా అందచేస్తోందని తెలిపారు. ఈ విధంగా వినాయక మండపాలకు విద్యుత్‌ను ఉచితంగా అందచేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బిజేపీ ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం హిందూ పండుగలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. గత వెఎస్సార్‌సీపీ ప్రభుత్వం వినాయక మండపాల నిర్వాహకుల నుంచి భారీగా కరెంట్ బిల్లులను వేసిందని, ఇబ్బందులకు గురిచేసిందని చెబుతూ, కూటమి ప్రభుత్వం భక్తుల మనోభావాలను గౌరవిస్తూ మండపాల ఏర్పాటుకు అవసరమైన అనుమతులను కూడా చాలా సులభంగా జారీ చేయడమే కాకుండా విద్యుత్‌ను కూడా ఉచితంగా అందిస్తోందని వివరించారు. ముమ్మనేని ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పండుగల నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, టీడీపీ స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్టేట్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ లో సత్తా చాటిన చిన్నారి శ్రీకర లాస్యను అభినందించిన ఎమ్మెల్యే గద్దె




విజయవాడ, సెప్టెంబర్ 15 (నేటి శుభోదయ):-క్రీడాకారులను అన్ని రకాలుగా ప్రోత్సహించడానికి తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. పతకాలు సాధించి, టైటిల్‌ను సొంతం చేసుకున్న శ్రీకర లాస్యను ఎమ్మెల్యే గద్దె అభినందించారు. మంగళవారం 12వ డివజన్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో లాస్య, ఆమె తల్లిదండ్రులు, కోచ్ తో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాకినాడలో జరిగిన స్టేట్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్లో విజయవాడకు చెందిన చిన్నారి శ్రీకర లాస్య అద్భుత ప్రతిభ కనబరిచి మొత్తం 5 పతకాలను సొంతం చేసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. చిన్న వయసులోనే రాష్ట్ర స్థాయి టైటిల్ ను లాస్య సొంతం చేసుకుని, మొత్తం 4 గోల్డ్, ఒక రజత పతకాన్ని సొంతం చేసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే ఇంతటి ప్రతిభ కనబరచడం గర్వకారణమని, లాస్య భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి తెలుగు రాష్ట్రాలకు, విజయవాడకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించడానికి అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. లాస్య తల్లిదండ్రులను, కోచ్ ను గద్దె ప్రత్యేకంగా అభినందించారు.

## టీటీడీకి కూరగాయల అందచేయడం అభినందనీయం

### కూరగాయల లారీకి జెండా ఊపిన ఎమ్మెల్యే గద్దె




విజయవాడ, సెప్టెంబర్ 15 (నేటి శుభోదయ):-తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగే నిత్య అన్నదానానికి కూరగాయలను పంపడం చాలా ఆనందంగా ఉందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. సోమవారం ఉదయం తూర్పులోని సిద్ధార్థ కళాశాల సమీపంలో తిరుమల తిరుపతికి వెళుతున్న కూరగాయల లారీకి ఎమ్మెల్యే గద్దె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరుమల తిరుపతిలో 1984 సంవత్సరంలో నిత్య అన్నదానాన్ని ఆనాటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు ప్రారంభించారన్నారు. విజయవాడ నగరం నుంచి తిరుపతిలో జరిగే నిత్య అన్నదానానికి కూరగాయలను మండవ కుటుంబరావు ప్రారంభించారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని గద్దె శ్రీనివాసరావు తదితరులు ఇప్పుడు పది టన్నుల కూరగాయలను పంపుతున్నారని చెప్పారు. అన్నదానం చాలా గొప్పదని పేర్కొన్నారు. కోట్ల రూపాయలు సహాయం చేసే కంటే తోటి వారి ఆకలిని తీర్చడం చాలా గొప్ప విషయమని అన్నారు. 4వ సారి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు అయిన తర్వాత టీటీడీలో నాణ్యమైన భోజనాలను ఏర్పాటు చేయడం, కొండపై పరిశుభ్రతను పాటించడం లాంటి చేస్తున్నారని చెప్పారు. చెన్నుపాటి ఉషారాణి మాట్లాడుతూ నిత్య అన్నదానానికి కూరగాయలను పంపించడం అభినందనీయమని అన్నారు. ధన, వస్తు, కూరగాయాల రూపంలో టీటీడీకి సహాయం చేయడం సంతోషంగా ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కంటే ఇప్పుడు భోజనాలు చాలా బాగున్నాయని భక్తులు చెబుతున్నారన్నారు. ఈ కార్యక్రమములో ఎమ్మెల్యేతోపాటు టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, స్థానికులు, వేంకటేశ్వర స్వామివారి భక్తులు పాల్గొన్నారు.

## "ఘనంగా ప్రముఖ పారిశ్రామికవేత్త మారం వెంకటేశ్వరరావు పుట్టినరోజు వేడుకలు"



తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 15 (నేటి- శుభోదయ) ప్రముఖ పారిశ్రామిక వేత్త, బిల్డర్, ఆర్యవైశ్య ముద్దుబిడ్డ, ఆర్యవైశ్య సంఘ గౌరవ అధ్యక్షులు మారం వెంకటేశ్వరరావు పుట్టినరోజు వేడుకలు పట్టణంలో పలువాడల్లో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ముందుగా ద్వారకాతిరుమల చిన్న వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆయన అభిమానులు సత్కరించి పూల బొకేలు అందించి, శాలువాలతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షులు కొర్లేపర రాము, ఆలపాటి చిన్న, పలివెల ఏకాంబేశ్వరరావు తదితరులు సత్కరించి పూల బొకేలు అందించారు. అనంతరం తాడేపల్లిగూడెం ప్రెస్ క్లబ్ ఏపీడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యులు గజపతి వరప్రసాద్, మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు చిక్కాల రామకృష్ణ, సీనియర్ జర్నలిస్ట్ మారంపూడి ఏసు తదితరులు సత్కరించారు. అనంతరం జీవిమాల్ సెంటర్లో భారీ కేక్ కట్ చేసి డిజె సౌండ్ సిస్టంతో భారీ గజమాలతో సత్కరించి బాణసంచా కాల్చి పలువురు నాయకులు, అభిమానులు మరియు జనసేన నాయకులు సింగం సుబ్బారావు ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మారం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నా పుట్టినరోజు సందర్భంగా అభిమానులు ఎంతో ఆనందంగా, ఉత్సాహంగా జరుపుకోవడం ఆనందంగా ఉందని మీయొక్క అభిమానం ఎప్పటికీ మర్చిపోను అని మీ వెంటే ఉంటానని నాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన అందరికీ ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన తనయులు మారం గిరీష్ గుప్తా మిత్ర బృందం భారీగా పాల్గొని పూల బొకేలు అందించి సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలి: మంత్రి సవితమ్మ

### ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి ఎద్దడి ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

### నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు ఉండకూడదు

### నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి మంత్రి సవిత




అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 15 నేటి శుభోదయ : పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి , సవితమ్మ నియోజకవర్గ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఎంపీడీఓలతో ఇతర అధికారులతో తాగునీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాలు, కాలనీలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గడం, భూగర్భ జలాలు పడిపోవడం వంటి పరిస్థితుల నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టి తాగునీటి సమస్యను అధిగమించాలని సూచించారు. తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో బోర్లు, నీటి వనరుల పరిస్థితిని పరిశీలించి అవసరమైన చోట్ల ప్రత్యామ్నాయ నీటి వనరులను ఏర్పాటు చేయాలని తెలిపారు. పనిచేయని బోర్లను వెంటనే మరమ్మతులు చేయడంతో పాటు, అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తాగునీరు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి సూచించారు. ప్రతి మండలంలో తాగునీటి సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారించి, సమస్య తలెత్తిన వెంటనే పరిష్కరించేలా కార్యాచరణ రూపొందించాలని అన్నారు. ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని, వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఎక్కడా తాగునీటి కొరత ఏర్పడకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సవితమ్మ స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఎంపీడీఓలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు...

## భక్తిశ్రద్ధలతో గణపతి మహోత్సవాలు.. గణనాథుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

-- బొండా రవితేజ



విజయవాడ, సెప్టెంబర్ 15 (నేటి శుభోదయ):- సెంట్రల్ లోని 61వ, 62వ డివిజన్లలో స్థానికంగా ఏర్పాటు చేసిన గణపతి మహోత్సవాల్లో తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బొండా రవితేజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణనాథుడికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా బొండా రవితేజ మాట్లాడుతూ వినాయకుడు విఘ్నాలను తొలగించి, విజయాలను ప్రసాదించే దేవుడని, ప్రతి శుభకార్యానికి గణనాథుడి పూజతో శ్రీకారం చుట్టడం మన సంస్కృతిలో ప్రత్యేకమైన సంప్రదాయమని అన్నారు. వినాయక చవితి పర్వదినం భక్తి, ఆధ్యాత్మికతతో పాటు ప్రజలందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. సెంట్రల్ లోని ప్రతి డివిజన్‌లో గణపతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉందని, ఉత్సవ కమిటీలు, యువత, స్థానిక ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను అందరూ శాంతియుతంగా, భక్తిభావంతో, పరస్పర సహకారంతో నిర్వహించుకోవాలని కోరారు. గణపతి ఉత్సవాలు కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలు మాత్రమే కాకుండా ప్రజల మధ్య సోదరభావాన్ని, ఐక్యతను పెంపొందించే వేడుకలుగా నిలుస్తాయని అన్నారు. యువత ఉత్సవాల్లో చురుగ్గా పాల్గొంటూ సేవా కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గణనాథుడి కృపతో సెంట్రల్ నియోజకవర్గంలోని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని, ప్రజల జీవితాల్లో ఉన్న అన్ని విఘ్నాలు తొలగి అభివృద్ధి, విజయాలు చేకూరాలని శ్రీ వరసిద్ధి వినాయకుడిని ప్రార్థించినట్లు బొండా రవితేజ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, టీడీపీ స్థానిక నాయకులు కంచి ధనశేఖర్, బెవర నారాయణ, కార్యకర్తలు, యువత, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పింఛన్ల దరఖాస్తు గడువు పొడిగించాలి

### ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించిన బిజెపి నాయకులు



యాడికి సెప్టెంబర్ 15 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండల వ్యాప్తంగా అర్హులైన పేద ప్రజలందరికీ పింఛన్లు అందేలా ఎన్టీఆర్ భరోసా పింఛన్ దరఖాస్తుల గడువును మరికొన్ని రోజులు పొడిగించాలని కోరుతూ బిజెపి మండల నాయకులు, చేనేత సెల్ ప్రతినిధులు మంగళవారం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) వీర రాజు ని కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యాడికి మండల బిజెపి అధ్యక్షుడు పొట్టే గంగాధర్, చేనేత సెల్ కన్వీనర్ కె. రమణ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల నూతన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను తాము పూర్తిగా స్వాగతిస్తున్నామని తెలిపారు. అయితే సాంకేతిక కారణాల వల్ల మండలంలోని అనేక గ్రామాల్లో అర్హులైన పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధార్ ఇ-కేవైసీ కాకపోవడం, అవసరమైన ధృవీకరణ పత్రాలు సకాలంలో అందకపోవడం మరియు ఆన్‌లైన్ సర్వర్లలో తలెత్తిన సాంకేతిక లోపాల కారణంగా అనేకమంది వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు మరియు చేనేత కార్మికులు నిర్ణీత గడువులోగా దరఖాస్తులు చేసుకోలేకపోయారని వివరించారు. ప్రభుత్వ పింఛనుపైనే ఆధారపడి జీవిస్తున్న ఎంతోమంది పేదలు గడువు ముగిసిపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. కావున ఈ విషయంపై మానవతా దృక్పథంతో స్పందించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పింఛన్ల దరఖాస్తు గడువును మరికొన్ని రోజులు పెంచేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను కోరారు. ప్రజా సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎంపీడీవో, ఈ విషయాన్ని వెంటనే ఉన్నతాధికారులకు నివేదిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షుడు జే. గిరి ప్రసాద్, ఉపాధ్యక్షుడు శంకర్, బిజెవైఎం మండల అధ్యక్షుడు ఎన్. సాయిరాం, ప్రధాన కార్యదర్శి గడ్డం రాజేష్ తో పాటు పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..



## వినాయక చవితి వేడుకల్లో నిరుపేద విద్యార్థులకు ఉచితంగా విద్యాసామగ్రి పంపిణీ



యాడికి సెప్టెంబర్ 15 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక :వినాయక చవితి పండగ పురస్కరించుకుని స్థానిక చౌడేశ్వరి కాలనీలోని వినాయక మండపం వద్ద వంకం నాగమయ్య కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో 5వ నంబర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు మరియు రబ్బర్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ దాతృత్వ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీఏ అరుణ జ్యోతితో పాటు ఉపాధ్యాయులు సర్వేశ్వర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, వీరబ్రహ్మం, వెంకటలక్ష్మమ్మ హాజరయ్యారు. పండుగ వేళ పేద విద్యార్థుల చదువుకు తోడ్పాటునందించిన వంకం నాగమయ్య కుటుంబ సభ్యుల ఉదారతను ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు కొనియాడుతూ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు వంకం నాగమయ్య, వంకం నాగరాజు, కూన వెంకటస్వామి, చింత నరసింహడు, యల్లపు లక్ష్మీనారాయణ, దాసరి తిరుమలేష్, వంకం వినయ్, సింహల వీరాంజనేయులు, సాకరే శ్రీనివాసులు, సాకరే దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

# గుడివాడలో పారిశుద్ధ్యంపై ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రత్యేక సమీక్ష

**పురపాలక కౌన్సిల్ హాల్ లో అధికారులతో సమావేశం**
**సమస్యలపై వార్డుల వారీగా కార్యదర్శులు, ఇన్స్పెక్టర్లను ప్రశ్నించిన ఎమ్మెల్యే రాము**
**-గుడివాడను పరిశుభ్ర పట్టణంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యం:ఎమ్మెల్యే.**
**-ప్రజలు ఫిర్యాదు చేసే వరకు ఆగవద్దు - ముందే గుర్తించి పరిష్కరించండి....**
**-గ్యాంగ్ వర్కులు, రోజువారీ ప్రణాళికలు రూపొందించండి**
**-రెండు రోజుల వర్షానికే నీరు నిలవడంపై ఆందోళన - పాత పరిస్థితులు రానివ్వద్దని స్పష్టం చేసిన ఎమ్మెల్యే**
**-రోడ్లపై తిరిగే పశువుల సమస్యపై దృష్టి పెట్టండి: కమిషనర్ మనోహర్**
**-విధులకు డుమ్మా కొట్టే సిబ్బందిపై చర్యలు తప్పవు: కమిషనర్**
**-ట్రాక్టర్లు, జేసీబీ,ఇతర వాహనాల టెండర్లు నెలలో పూర్తి చేస్తామని సమావేశంలో వెల్లడించిన కమిషనర్**



గుడివాడ, సెప్టెంబర్ 15 నేటి శుభోదయ: గుడివాడ పట్టణంలో పారిశుద్ధ్య సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రత్యేక దృష్టి సారించారు. పురపాలక సంఘ కౌన్సిల్ హాల్లో శానిటేషన్‌పై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వార్డుల వారీగా నెలకొన్న సమస్యలను కార్యదర్శులు, శానిటేషన్ ఇన్స్పెక్టర్లు, సూపర్‌వైజర్లను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో ఉత్పన్నమవుతున్న సమస్యలను అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా సిబ్బంది కొరత కారణంగా పారిశుద్ధ్య నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని శానిటేషన్ ఇన్స్పెక్టర్లు ఎమ్మెల్యేకు వివరించారు. సిబ్బంది కొరతను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సింహాద్రి మనోహర్‌కు ఎమ్మెల్యే రాము సూచించారు.గుడివాడను పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సిబ్బందిలో నిర్లక్ష్యం పెరిగిపోవడం ఆక్షేపణీయమన్నారు. ప్రభుత్వ సర్వేలో శానిటేషన్ విభాగంలో గుడివాడ పురపాలక సంఘం 20 శాతం వెనుకబడటం ఆందోళన కలిగిస్తోందన్నారు.డ్రైన్లలో సిల్ట్ తొలగించి గట్టునే పడేసి రోజుల తరబడి తొలగించకపోతే సిల్ట్ తొలగించిన ప్రయోజనం ఏముంటుందని ఎమ్మెల్యే ప్రశ్నించారు. అధికారులు కూడా క్షేత్రస్థాయిలో రోడ్లపై తిరిగి పరిస్థితులను పరిశీలించాలని సూచించారు. ప్రజలు ఫిర్యాదు చేసే వరకు వేచి చూడకుండా సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా కింది స్థాయి అధికారులు, సిబ్బంది పనితీరును నిరంతరం పరిశీలించాలన్నారు. గ్యాంగ్ వర్కులు నిర్వహించాలని పదేపదే చెబుతున్నామని, ఇకనైనా నిర్లక్ష్యాన్ని వీడి పారిశుద్ధ్య మెరుగుదలకు రోజువారీ ప్రణాళికలు రూపొందించాలని ఎమ్మెల్యే సూచించారు.రోడ్లపై చెట్ల కొమ్మలు పడిపోయినా సిబ్బంది పట్టించుకోవడం లేదని, అవి వాహనదారులకు ప్రమాదకరంగా మారుతున్నాయని ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు. విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వకుండా విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి రోడ్లపై, డ్రైనేజీల్లో పడేస్తున్నారని అధికారులు సమావేశంలో తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే వెంటనే విద్యుత్ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, చెట్ల కొమ్మలను తొలగించే సమయంలో పురపాలక సంఘానికి సమాచారం ఇవ్వాలని సూచించారు.వినియోగించిన వంట నూనెను శుద్ధి చేసే మిషన్లు లేని హోటళ్లపై కఠినంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే రాము చెప్పారు. నిబంధనలు పాటించని హోటళ్లను మూసివేయాలని స్పష్టం చేశారు. హోటళ్ల యాజమాన్యాల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడితే సహించేది లేదన్నారు. ఇప్పటికే నోటీసులు ఇచ్చామని, తదుపరి చర్యలు కూడా తీసుకుంటామని అధికారులు ఎమ్మెల్యేకు తెలిపారు.ప్రస్తుతం పట్టణంలో నెలకొన్న మంచి వాతావరణాన్ని కొనసాగించాలని, శానిటేషన్ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే రాము స్పష్టం చేశారు. అంతిమంగా ప్రజల సంతృప్తే తనకు ముఖ్యమన్నారు.ఎమ్మెల్యే రాము సూచించిన ప్రతి అంశాన్ని అధికారులు, సిబ్బంది పరిగణనలోకి తీసుకుని అమలు చేయాలని కమిషనర్ సింహాద్రి మనోహర్ స్పష్టం చేశారు. రోడ్లపై తిరుగుతున్న పశువుల సమస్యపైనా దృష్టి సారించాలని సూచించారు. విధులకు సక్రమంగా హాజరుకాని సిబ్బంది వివరాలు అందిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సిబ్బంది, ఉద్యోగుల ఖాళీలను సెంట్రల్ ఆఫీస్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇకనైనా సిబ్బంది తమ పనితీరును మార్చుకోవాలని కమిషనర్ సూచించారు.సమావేశం ప్రారంభానికి ముందు కమిషనర్ సింహాద్రి మనోహర్ మాట్లాడుతూ ప్రజారోగ్యం, పారిశుద్ధ్యంపై ప్రభుత్వం, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. వాహనాల సమస్యను నెలలోపు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ట్రాక్టర్లు, జేసీబీ, ఇతర వాహనాలకు టెండర్లు పిలుస్తున్నామని చెప్పారు. డ్రైన్ల క్లీనింగ్‌పై అధిక సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయని, అందుబాటులో ఉన్న వనరులతో సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. బేసిక్ రూల్ ప్రకారం చెత్తను 24 గంటల్లోపు తొలగించాలని, ప్రతి ఒక్కరూ ఈ నిబంధనను తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. ముఖ్యంగా అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటేనే సమస్యలను త్వరగా పరిష్కరించగలమన్నారు. ప్రజల్లో స్పందన వచ్చినప్పుడే తాము చేస్తున్న పనులకు సార్థకత లభిస్తుందని, ప్రజలకు దగ్గరగా ఉంటూ పనిచేయాలని కమిషనర్ సూచించారు.ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాకముందు గుడివాడ పురపాలక సంఘంలో పారిశుద్ధ్య పరిస్థితులు దారుణంగా ఉండేవని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో మార్పులు తీసుకువచ్చామని, అనేక అంశాల్లో మంచి ప్రగతి సాధించామని తెలిపారు.అయితే ఇటీవల కింది స్థాయి అధికారుల పనితీరులో స్పష్టమైన నిర్లక్ష్యం కనిపిస్తోందని ఎమ్మెల్యే ఆక్షేపించారు. తాను వార్డుల్లో పర్యటిస్తున్న సమయంలో అనేక సమస్యలు తన దృష్టికి వస్తున్నాయని చెప్పారు. ముఖ్యంగా డ్రైనేజీల్లో సిల్ట్ తొలగింపు, రోడ్ల పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.రెండు రోజుల వర్షాలకే అనేక ప్రాంతాల్లో నీరు నిలిచిపోయిందని, గతంలో డ్రైనేజీ వ్యవస్థలో మంచి పురోగతి సాధించామని ఎమ్మెల్యే గుర్తు చేశారు. అయితే కొన్ని రోజులుగా కొనసాగుతున్న నిర్లక్ష్య విధానాల కారణంగా మళ్లీ పాత పరిస్థితులు వచ్చే పరిస్థితి కనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రజారోగ్యం, పరిసరాల పరిశుభ్రత తనకు అత్యంత ముఖ్యమని, ఈ రెండు అంశాల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే రాము హెచ్చరించారు. గతంలో పనిచేసిన సిబ్బందే ప్రస్తుతం ఉన్నారని, అయినప్పటికీ మనం మార్పు తీసుకురాగలిగామని ఎమ్మెల్యే అన్నారు. ఇప్పుడు మళ్లీ నిర్లక్ష్యం కారణంగా పాత పరిస్థితులు నెలకొనే అవకాశం కనిపిస్తోందని, ఇది ఎట్టి పరిస్థితుల్లోనూ జరగకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము స్పష్టం చేశారు.అసిస్టెంట్ కమిషనర్ పి . శ్రీనివాసరావు, మున్సిపల్ ఇంజనీర్ సతీష్ చంద్ర,డి ఇ శివాజీ, గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, టిడిపి నాయకులు లింగం ప్రసాద్, చేకూరు జగన్మోహన్రావు, మున్సిపల్ ఏ ఇ లు రాజేష్, శ్రావణ్, సత్యనారాయణ, సానిటరీ ఇన్స్పెక్టర్లు అప్పారావు, శివలక్ష్మి, లావణ్య,శానిటేషన్ సూపర్వైజర్లు, కార్యదర్శిలు, సంబంధిత శాఖల అధికారులు సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.



## సాగర తీర మహాగణపతిని దర్శించుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్

**-మంగినపూడి సాగర తీరంలో 63 అడుగుల సప్తమృత్తిక విజయగణపతికి ప్రత్యేక పూజలు**





మంగినపూడి బీచ్, సెప్టెంబరు 15 నేటి శుభోదయ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ మంగళవారం మంగినపూడి సాగర తీరంలో ఏర్పాటు చేసిన మహాగణపతి ఉత్సవాలకు హాజరై 63 అడుగుల సప్తమృత్తిక విజయగణపతిని దర్శించుకున్నారు. విజయవాడ నుంచి మంగళవారం సాయంత్రం రోడ్డు మార్గంలో మంగినపూడి బీచ్‌కు చేరుకున్న గవర్నర్‌కు వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర గవర్నర్, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో పాల్గొని విజయగణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు గవర్నర్‌కు ఆశీర్వచనాలు అందించారు.మంగినపూడి సాగర తీరంలో నిర్వహిస్తున్న మహాగణపతి ఉత్సవాల విశేషాలను గవర్నర్‌కు నిర్వాహకులు వివరించారు. 63 అడుగుల సప్తమృత్తికతో రూపొందించిన విజయగణపతి విగ్రహాన్ని గవర్నర్ ఆసక్తిగా పరిశీలించారు.గవర్నర్ పర్యటన సందర్భంగా రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్ డీకే బాలాజి, బందరు పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు, జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, సహాయ కలెక్టర్ నమ్రత అగర్వాల్, పెడన, పామర్రు, గుడివాడ నియోజకవర్గాల శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్, వర్ల కుమార్ రాజా, వెనిగండ్ల రాము, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, ఏపీ స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ హసీమ్ బేగ్ బందరు ఆర్డీవో కే సాంబశివరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ చలమలశెట్టి నరసింహారావు, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సాంబశివరావు, కార్యక్రమ నిర్వహణ కోఆర్డినేటర్ డిఆర్డిఏ పిడి హరిహరనాథ్ మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపు సత్యనారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ తదితరులు మంగినపూడి బీచ్ వద్ద గవర్నర్‌కు స్వాగతం పలికారు.విజయగణపతి దర్శనం, ప్రత్యేక పూజల అనంతరం గవర్నర్ మంగినపూడి నుంచి రోడ్డు మార్గంలో విజయవాడకు తిరుగు ప్రయాణమయ్యారు.

## ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం. మైలవరం ఎమ్మెల్యే



విజయవాడ, సెప్టెంబర్ 15 (నేటి శుభోదయ):-గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు, సంక్షేమ ఫలాలు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మైలవరం ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు అన్నారు. మైలవరం నియోజకవర్గ సమగ్రాభివృద్ధిలో భాగంగా గంగినేనిపాలెం గ్రామంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలను ఆయన వెల్లడించారు.జి.కొండూరు మండలం గంగినేనిపాలెం గ్రామంలో మంగళవారం పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే వసంత ప్రారంభించి, మరికొన్ని పనులకు శంకుస్థాపన చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.36 లక్షలతో నిర్మించిన గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.45 లక్షలతో నిర్మించిన అంతర్గత సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. అలాగే జిల్లా ఖనిజాభివృద్ధి నిధులు రూ.25 లక్షలతో నిర్మించనున్న బీసీ సామాజిక భవనానికి, రూ.15 లక్షలతో చేపట్టనున్న తక్కువస్థాయి వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మొత్తంగా గ్రామంలో రూ.1.21 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గంగినేనిపాలెంలో రూ.25 లక్షల అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే కృష్ణప్రసాదు తెలిపారు. పల్లె పండుగ రెండో విడత కార్యక్రమం ద్వారా రూ.45 లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు.అదేవిధంగా రూ.36 లక్షలతో గ్రామీణ ఆరోగ్య కేంద్రం, రూ.25 లక్షలతో బీసీ సామాజిక భవనం, రూ.15 లక్షలతో తక్కువస్థాయి వంతెన నిర్మాణ పనులు చేపట్టినట్లు వివరించారు. గ్రామంలోని వాగు అభివృద్ధికి రూ.5 లక్షలు కేటాయించి పనులు చేపట్టినట్లు తెలిపారు. అకాల వర్షాలు, వరదల కారణంగా ముంపునకు గురైన గంగినేనిపాలెం గ్రామంలోని 100 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించడంతో పాటు నిత్యావసర సరుకులను త్వరితగతిన అందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.వరదల్లో పశువులు, జీవనోపాధిని కోల్పోయిన కుటుంబాలకు కూడా అండగా నిలిచినట్లు చెప్పారు. జింకల వెంకటేశ్వరరావు గేదె మృతి చెందడంతో రూ.50 వేల, సాగర్ల ముత్యాలు మేకలు మృతి చెందడంతో రూ.1.50 లక్షల, నన్నెబోయిన వెంకటేశ్వరరావు ప్రమాదవశాత్తు మరణించడంతో ఆయన కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించినట్లు వివరించారు.విద్యార్థుల చదువుకు కూడా తన వంతు సహకారం అందిస్తున్నట్లు కృష్ణప్రసాదు తెలిపారు. 2025 సంవత్సరంలో ఐదుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున మొత్తం రూ.25 వేల, 2026 సంవత్సరంలో ముగ్గురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున మొత్తం రూ.15 వేల ఆర్థిక సహాయం అందించినట్లు వెల్లడించారు.అనారోగ్యంతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి, స్థానిక అనుమతుల ద్వారా ఆర్థిక భరోసా కల్పించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. స్థానిక అనుమతుల ద్వారా నలుగురు లబ్ధిదారులకు రూ.5,37,620, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 16 మంది లబ్ధిదారులకు రూ.6,43,537 అందించినట్లు చెప్పారు.ఈ రెండు పథకాల ద్వారా కలిపి గంగినేనిలో 20 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.11,81,157 ఆర్థిక సాయం అందించినట్లు ఎమ్మెల్యే వివరించారు.కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా గంగినేనిపాలెం గ్రామ ప్రజలకు గణనీయమైన ప్రయోజనం చేకూరుతోందని ఎమ్మెల్యే తెలిపారు.ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం ద్వారా గ్రామంలో 411 మంది లబ్ధిదారులకు నెలకు రూ.17.81 లక్షలు, ఏడాదికి మొత్తం రూ.2,13,72,000 అందుతున్నట్లు చెప్పారు.ఆటో డ్రైవర్ల సేవా పథకం ద్వారా 29 మంది లబ్ధిదారులకు రూ.4,35,000 ప్రయోజనం చేకూరినట్లు తెలిపారు. తల్లికి వందనం పథకం ద్వారా 437 మంది లబ్ధిదారులకు రూ.58,99,500 అందుతున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం.ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ , మంత్రి నారా లోకేష్ కృషితో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తోందని కృష్ణప్రసాదు పేర్కొన్నారు.సూపర్ సిక్స్ పథకాలను దశలవారీగా అమలు చేస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నూతన పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరిస్తోందని, అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మైలవరం నియోజకవర్గ సమగ్రాభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. గ్రామాల అవసరాలను గుర్తించి రోడ్లు, వంతెనలు, కాలువలు, ఆరోగ్య కేంద్రాలు, సామాజిక భవనాలు వంటి మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారం చూపేందుకు నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి అక్కల రామమోహనరావు (గాంధీ), కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబాలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి ఎమ్మెల్యే బొండా ఉమా



విజయవాడ, సెప్టెంబర్ 15 (నేటి శుభోదయ):-బిఆర్ టిఎస్ రోడ్డులోని సెంట్రల్ ఎమ్మెల్యే కార్యాలయంలో 25వ డివిజన్ అరండల్ పేట, దుర్గా అగ్రహారానికి చెందిన నాలుగు కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ) ద్వారా మంజూరైన రూ.2,95,539 విలువైన ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అందజేశారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో భరోసాగా నిలుస్తోందని అన్నారు. అనారోగ్యం, వైద్య చికిత్స వంటి అనుకోని పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా తన వంతు కృషి చేస్తానని ఉమా స్పష్టం చేశారు.ప్రజల సమస్యలను పరిష్కరించడమే తన ప్రధాన లక్ష్యమని, ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా తన కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమం, ప్రజల ఆరోగ్యం, సామాజిక భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఘంటా కృష్ణమోహన్, 25వ డివిజన్ అధ్యక్షులు మాచర్ల గోపి, దొంగర ఆంజనేయులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కన్యకా పరమేశ్వరి ఆలయంలో వినాయకునికి జె.సి. ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక పూజలు

**ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలని పిలుపు**



యాడికి సెప్టెంబర్ 15 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండల కేంద్రంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని తాడిపత్రి మాజీ మున్సిపల్ చైర్మన్ జె.సి. ప్రభాకర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీ బాల వినాయక స్వామివారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ అర్చకుల నుంచి తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం జె.సి. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ... ఆ విఘ్నేశ్వరుని దివ్య ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని, ప్రతి ఒక్కరి ఇంట సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ ఐక్యమత్యంతో మెలగాలని సూచించారు. పూజా కార్యక్రమాల అనంతరం అక్కడే ఉన్న ఆర్యవైశ్య ప్రముఖులు, యువకులతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. ఆర్యవైశ్య సామాజికవర్గం కేవలం వ్యాపార రంగానికే పరిమితం కాకుండా, సమాజ సేవలో భాగస్వాములవుతూ రాజకీయంగా కూడా ఉన్నత స్థాయికి ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. యువత రాజకీయాల పట్ల అవగాహన పెంచుకుని చురుగ్గా రాణించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, ఆర్యవైశ్య మహిళా మండలి, యువజన సంఘం సభ్యులతో పాటు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు జె.సి. అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

## కోరుకొండ మండలంలో 13 కుటుంబాలకు రూ.5.07 లక్షల సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సహాయం చెక్కులు పంపిణీ....!

**- 'ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది..:- రూడా చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి..**



కోరుకొండ, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);కోరుకొండ మండలంలోని పలు గ్రామాలకు చెందిన 13 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.5,07,006 లు విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను రూడా చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి అందజేశారు.కనుపూరు, గాదరడ, జంబుపట్నం, బుచ్చింపేట, జగన్నాధపురం, కోరుకొండ, గరగళం పాలెం గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఈ ఆర్థిక సహాయం అందింది. లబ్ధిదారుల వివరాలు:సాలపు వీరబాబు -- రూ.70,352 లు, బెల్లపు నీలమస్వరాజలి -- రూ.47,001 లు, యాసరపు కుమారి -- రూ.30,786 లు,సంకురాత్రి బుల్లమ్మై -- రూ.30,786 లు, నైనాల రవికుమార్ -- రూ.48,848 లు, రాయుడు లక్ష్మి రాజ్ -- రూ.25,000 లు, బత్తుల జ్యోతి -- రూ.20,000 లు, మట్టా రాజ్ కుమార్ -- రూ.52,422 లు, పద్మావతి గన్ని రాజు -- రూ.40,000 లు, గుంతల శివ -- రూ.46,898 లు, మట్టా రూపాదేవి -- రూ.31,795 లు, కొంచెర్ల రఘు ప్రసాద్ -- రూ.44,509 లు, గంగుల గుణశేఖర్ -- రూ.18,609 లు,మొత్తం: రూ.5,07,006 లు అందజేశారు.ఈ సందర్భంగా బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. అనారోగ్యం, వైద్య ఖర్చుల కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో భరోసా కల్పిస్తోందన్నారు. ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని వెంకటరమణ చౌదరి పేర్కొన్నారు.

# నగరంలో రూ.107.71 కోట్ల కీలక ప్రాజెక్టులకు శ్రీకారం..

**అమృత్ 2.0 పథకం కింద రెండు ప్రాజెక్టులకు భూమిపూజ చేసిన జిల్లా ఇన్చార్జ్ మంత్రి రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ.భరత్, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, తదితరులు..**

- **అనంతపురం నగరానికి నీళ్ల సమస్య లేకుండా చర్యలు..**
- **జిల్లా ఇన్చార్జ్ మంత్రి రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ.భరత్**
- **ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చొరవతో తాగునీరు, మురుగునీటి వ్యవస్థలో మార్పులు**
- **6 నెలల్లోనే ప్రాజెక్టు పనులు పూర్తవుతాయి : ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ**
- **ప్రభుత్వం చేస్తున్న మంచిని గుర్తించాలి : ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు..**



అనంతపురం బ్యూరో సెప్టెంబర్ 15 నేటి శుభోదయ : అనంతపురం నగర అభివృద్ధిలో భాగంగా అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ఆధ్వర్యంలో నగరంలోని పాతవూరులోగల శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి గుడి ఎదురుగా ఉన్న వాటర్ ట్యాంక్ కాంపౌండ్ లో అనంతపురం నగర పాలక సంస్థ త్రాగునీటి మెరుగుదల పథకం మరియు మురుగునీటి నిర్వహణ వ్యవస్థ పథకం (అమృత్ 2.0 పథకం ద్వారా) కింద అంచనా మొత్తం 107.71 కోట్ల రూపాయలతో రెండు భారీ ప్రాజెక్టులకు మంగళవారం సాయంత్రం నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రివర్యులు టీజీ.భరత్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, తదితరులు పాల్గొన్నారు.నగరంలో తాగునీటి సరఫరాలో ఉన్న అంతరాలను పూర్తిగా తొలగించి.. ప్రతి ఇంటికీ సమర్థవంతంగా నీటిని అందించడమే లక్ష్యంగా రూ. 37.39 కోట్లతో 'వాటర్ సప్లై ఇంప్రూవ్‌మెంట్ స్కీమ్' ఇందులో ఉంది. నీటి సరఫరాను క్రమబద్ధీకరించేందుకు నగరంలో 5.47 కిలోమీటర్ల పొడవైన గ్రావిటీ మెయిన్ పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయనున్నారు. నగరంలోని అన్ని ప్రాంతాలకు తాగునీరు చేరేలా 12.27 కిలోమీటర్ల పొడవునా కొత్త డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ను నిర్మించనున్నారు. నగరంలో నీటి కొరత రాకుండా ఉండేందుకు 6 కొత్త ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మించి, మొత్తం 5200 కిలోలీటర్ల సామర్థ్యం గల అదనపు నీటి నిల్వను అందుబాటులోకి తెస్తున్నారు. నగరంలోని మారుతి నగర్, సంగమేశ్ నగర్, ఆదర్శ నగర్, గాంధీ పార్క్, మరియు జనశక్తి నగర్ వంటి ప్రముఖ ప్రాంతాలలో ఈ కొత్త ట్యాంక్ లను నిర్మించనున్నారు. మరోవైపు తాగునీటితో పాటు నగర పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు రూ.70.32 కోట్లతో అమృత్ 2.0 సీవరేజ్ అండ్ సెప్టేజ్ మేనేజ్‌మెంట్ స్కీమ్' పనులకు శ్రీకారం చుట్టారు. నగర మురుగునీటిని శుద్ధి చేసేందుకు అత్యాధునిక సాంకేతికతతో 25 ఎం.ఎల్.డి సామర్థ్యం కలిగిన భారీ మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని నిర్మించనున్నారు. మురుగునీటి తరలింపు కోసం 5.47 కిలోమీటర్ల పొడవైన సీవర్ ట్రంక్ మెయిన్ నిర్మాణంతో పాటు, ప్లాంట్ నిరంతర నిర్వహణ కోసం 250 కేవిఏ ట్రాన్స్‌ఫార్మర్ ను కూడా ఏర్పాటు చేస్తున్నారు.ఈ సందర్భంగా మంత్రివర్యులు టీజీ.భరత్ మాట్లాడుతూ అమృత్ 2.0 పథకం ద్వారా నీటి సమస్య లేకుండా చేస్తున్నందుకు ఎమ్మెల్యే దగ్గుపాటి కృషిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ ప్రాజెక్టుల అమలు ద్వారా అసలు అనంతపురం నగరానికి ఎక్కడా తాగునీటి సమస్య ఉండదన్నారు. మురుగునీరు శుద్ధి చేసేలా 25 ఎం.ఎల్.డి ప్లాంట్ ను తీసుకొచ్చారన్నారు. నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేసే విధంగా చర్యలు చేపట్టారన్నారు. ఇలాంటివి చేయాలంటే.. అది ఒక్క ఎన్డీఏ ప్రభుత్వంతో మాత్రమే సాధ్యమన్నారు. వేరే ప్రభుత్వాలకు ఇలాంటి ఆలోచనలు ఉండవన్నారు. గత ప్రభుత్వంలో పేదలకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్లు మూసివేశారన్నారు. పేదల కడుపుకొట్టే ఆలోచన వారికి ఎలా వచ్చిందో అర్థం కావడం లేదన్నారు. ఎన్ని కష్టాల్లు ఉన్నా తల్లికి వందనం వంటి పథకాలు వంటివి ఇచ్చిన మాట ప్రకారం నెరవేర్చినట్టు చెప్పారు. త్వరలోనే కొత్త పింఛన్లను ఇస్తున్నామని మంత్రి భరత్ చెప్పారు. కేవలం సంక్షేమ పథకాలు మాత్రమే కాకుండా శ్రీ సత్యసాయి జిల్లాలో 5వ జనరేషన్



యుద్ధవిమానాల తయారీ పరిశ్రమను లక్ష కోట్లతో తీసుకొచ్చామన్నారు. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారికి చాలా మంచి అవకాశాలు వస్తాయన్నారు. ఇప్పటి నుంచే చదువుకున్న వారు, వ్యాపారాలు చేసుకునే ముందు చూపుతో వ్యవహరిస్తే.. మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. 20 లక్షల ఉద్యోగాలు తెస్తామని గతంలో మాట ఇచ్చామని, అది నెరవేర్చి తీరుతామన్నారు. దేశానికి వచ్చే పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వస్తున్నాయన్నారు. ఇదంతా సీబీఎన్ బ్రాండ్ తోనే సాధ్యమవుతోందన్నారు. ఇవన్నీ గమనించి.. ఏ ఎన్నికలు జరిగినా కూటమిని గెలిపించాలన్నారు. పొరుపాటున ఇతరులను గెలిపిస్తే వారు పని చేసే పరిస్థితి ఉండదన్నారు. వాళ్లకు కేవలం పదవులు, డబ్బు కావాలని పని చేసే పరిస్థితి ఉండదన్నారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కూటమిని గెలిపించాలన్నారు. గతంలో కేంద్రం నుంచే వచ్చే నిధులను దారి మళ్లించారన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక విద్యుత్ ఛార్జీలను పెంచకుండా తగ్గిస్తున్నామన్నారు. గుజరాత్ లో గత 25 ఏళ్లుగా ఒకే ప్రభుత్వాన్ని గెలిపించడం వలనే అభివృద్ధి సాధ్యమైందన్నారు. రాష్ట్రంలో, దేశంలో ఒక స్థిరమైన, బలమైన ప్రభుత్వం ఉంది కాబట్టే అభివృద్ధి జరుగుతోందన్నారు. మంత్రి నారా లోకేష్ డీఎస్సీని సమర్థవంతంగా చేపడితే.. అసత్యాలు ప్రచారం చేస్తున్నారని విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు లాంటి నాయకుడు దొరకడం మన అదృష్టమన్నారు. అనంతపురంలో అభివృద్ధి గురించి చెప్పాలంటే.. ఇక్కడ రియల్ ఎస్టేట్ లో భూముల ధరల పెరుగుదలే నిదర్శనమన్నారు. అందుకే ఇతరులు చెప్పే అబద్ధాలు నమ్మవద్దని.. కష్టపడి పని చేసే వారికి ఓట్లు వేసి గెలించాలని మంత్రి టీజీ భరత్ కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ తాగునీరు, మురుగునీటి సమస్యలకు తాత్కాలిక ఉపశమనాలు కాకుండా, భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక మౌలిక వసతుల ద్వారా శాశ్వత పరిష్కారం చూపిస్తున్నట్టు తెలిపారు. ఈ రెండేళ్లలో జరిగిన అభివృద్ధి అనంతపురం నగరంలో ఏ మూలన ఉన్న ప్రాంతానికి వెళ్లినా కనిపిస్తుందన్నారు. ఏ సమస్య ఉందన్నా.. చిన్న ఫోన్ కాల్ ద్వారానే పరిష్కరిస్తున్నామన్నారు. గత ఐదేళ్లుగా ఎక్కడ ప్రజలు పడిన ఇబ్బందిని గుర్తించి.. దానిని పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. అమృత్ 2.0 ద్వారా 107 కోట్లు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ రెండేళ్ల కాలంలో 1300 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశామన్నారు. ఓల్డ్ టౌన్ అమ్మవారి టెంపుల్ వద్ద 30 ఏళ్లుగా ఉన్న రోడ్డు సమస్యకు పరిష్కారం చూపామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నది ఆంధ్రప్రదేశ్ మాత్రమేనన్నారు. ఈ రెండేళ్ల కాలంలోనే 25 లక్షల కోట్లు పెట్టుబడులు తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ది అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో లక్ష కోట్లతో డిఫెన్స్ ఇండస్ట్రీని తీసుకొచ్చారన్నారు. ఎన్నో రాష్ట్రాలు పోటీ పడినా 36 రోజుల్లోనే అనుమతులు మంజూరు చేసి పరిశ్రమను తీసుకొచ్చిన ఘనత మంత్రి టీజీ.భరత్ దే అని అన్నారు.ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అనంతపురం నగరాన్ని రాష్ట్రంలో నెంబర్ -1గా నిలిపేందుకు ఎమ్మెల్యే దగ్గుపాటి కృషి చేస్తున్నారన్నారు. నగరంలో ఏ కాలనీలో చూసినా నూతన రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారన్నారు. అనంతపురం నగరంలో 80 వేల ఇళ్లు ఉన్నాయని.. 40 వేల ఇళ్లకు ఇంటింటికీ నీరు అందిస్తున్నామన్నారు. మిగిలిన 40 వేల ఇళ్లకు కూడా నీరు అందించేందుకే ఈ పథకాన్ని తీసుకొచ్చామన్నారు. ఈ పథకం ద్వారా పాతూరులోని దక్షిణ భాగాన్ని 5 కిలోమీటర్ల మేర నీటిని పంప్ చేసి ప్రతి ఇంటికి నీరు ఇస్తున్నామన్నారు. మురుగునీటిని రీ సైక్లింగ్ చేసి వినియోగించే విధంగా మరో ప్రాజెక్టు చేపట్టామన్నారు. ఒక్కసారిగా 107 కోట్లతో ప్రాజెక్టుల పనులు భూమిపూజ చేసి ప్రారంభించారంటే.. అది ముఖ్యమంత్రి చంద్రబాబుకు అనంతపురం జిల్లాపై ఉన్న ప్రేమకు నిదర్శనమన్నారు. నీటి సమస్య లేకుండా చేసే విధంగా అమృత్ 2.0 పథకం ద్వారా ఈ ప్రాజెక్టులు చేపట్టామన్నారు. వీటిని 6 నెలల్లోనే పూర్తి చేసే విధంగా ఈ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం మహిళా పక్షపాతిగా ఉంటుందని.. వారికి మేలు చేసే విధంగా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసినట్టు చెప్పారు. ఈ ప్రభుత్వం చేసిన మేలు గుర్తించి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. తల్లికి వందనం, స్త్రీ శక్తి వంటి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అలాగే మన రాష్ట్రం గురించి, మన భవిష్యత్ తరాల గురించి ఆలోచించేది కూటమి ప్రభుత్వం అన్నారు. ప్రస్తుతం జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరింతగా కొనసాగాలంటే.. వచ్చే ఎన్నికల్లో గెలిపించాలన్నారు. అనంతరం ఇంచార్జి మంత్రిని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆయా శాఖల డైరెక్టర్లు రంగాచారి, బెస్త పవన్, పోతుల నరసింహులు, పిఎల్ఎన్ మూర్తి, కడియాల కొండన్న, పరమేష్, బొమ్మినేని శివ, రాజశేఖర్, నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంత్ రావు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రామ్మోహన్ రెడ్డ ఈ సూర్యనారాయణ, ఈఈ షాకిర్, డిఈఈ జ్యోతి, మెప్మా పిడి విశ్వజ్యోతి, ఆయా శాఖల అధికారులు, జిందాల్ సంస ప్రతినిధులు, నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## గన్నవరం లో అన్న కాంటీన్ ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం

**గురువారం మధ్యాహ్నం 12 గంటలకు**

**అన్న క్యాంటీన్ ను ప్రారంభించనున్న విప్, ఎమ్మెల్యే యార్లగడ్డలి**




గన్నవరం, సెప్టెంబర్ 15 నెటి శుభోదయ: గన్నవరం నియోజకవర్గ పేదలు, కార్మికులు, చిరు వ్యాపారుల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్ అన్ని సౌకర్యాలతో సిద్ధమైంది. బాయ్స్ హైస్కూల్ గ్రౌండ్ సమీపంలో ఏర్పాటు చేసిన ఈ అన్న క్యాంటీన్‌ను ఈ నెల 16వ తేదీ బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ అన్న క్యాంటీన్ ద్వారా రూ.5 లకే అల్పాహారం అలానే మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనాన్ని అందించనున్నారు. దీనివల్ల వివిధ పనుల నిమిత్తం వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు మరియు ఉద్యోగులకు ఎంతో మేలు చేకూరనుంది. బాయ్స్ హైస్కూల్ గ్రౌండ్ సమీపంలో ఉండటంతో అందరికీ సులభంగా అందుబాటులో ఉండే వీలుంది. ప్రారంభోత్సవానికి సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.

## కృష్ణాజిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన విక్కుర్తి



అవనిగడ్డ, సెప్టెంబర్ 15 నేటి శుభోదయ: ఇటీవల అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్‌గా నియమితులైన విక్కుర్తి శ్రీనివాసరావు మచిలీపట్నం కలెక్టరేట్‌లో కృష్ణాజిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు దుశ్శాలువ కప్పి సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు.అనంతరం అవనిగడ్డ నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను విక్కుర్తి శ్రీనివాసరావు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.విక్కుర్తి ప్రస్తావించిన సమస్యలపై కలెక్టర్ డి.కె. బాలాజీ సానుకూలంగా స్పందించారు. సంబంధిత అంశాలను పరిశీలించి, సమస్యల పరిష్కారానికి త్వరలోనే అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికార యంత్రాంగం తరుపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

## గుడివాడలో ఆర్టీసీ విద్యుత్ బస్సులపై సీఐటీయూ ధర్నా




గుడివాడ, సెప్టెంబర్ 15 నేటి శుభోదయ: ఆర్టీసీలో ప్రవేశపెడుతున్న విద్యుత్ బస్సులను ఆర్టీసీ సంస్థ ద్వారానే నడపాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గుడివాడ ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ఆర్టీసీని ప్రైవేటీకరించే ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.ఆర్టీసీని ప్రైవేటీకరణ చేసే కుట్రలో భాగంగానే విద్యుత్ బస్సుల నిర్వహణను 'పినాకిని' అనే ప్రైవేట్ సంస్థకు అప్పగిస్తున్నారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.సి.పి. రెడ్డి ఆరోపించారు. దశలవారీగా ఆర్టీసీని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తూ... వేల కోట్ల రూపాయల ఆస్తులు కలిగిన ఆర్టీసీ సంస్థను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆయన మండిపడ్డారు.ఆర్టీసీ విద్యుత్ బస్సులను ప్రైవేట్ సంస్థలకు కాకుండా ఆర్టీసీ సంస్థ ద్వారానే నిర్వహించాలని, సంస్థను పరిరక్షించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సమరం, కార్మిక సంఘం నాయకులు కొండ, రజిని తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గణపతి మహోత్సవాలు.. గణనాథుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

**బీజేపీ కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ**



విజయవాడ, సెప్టెంబర్ 15 (నేటి శుభోదయ):- బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణపతి మహోత్సవాల్లో బీజేపీ కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర నాయకులు ఉప్పలపాటి శ్రీనివాస్ రాజు, ముళ్ళ వెంకట సుబ్బయ్య తో కలిసి బి.ఎల్.ఏ1 కన్వీనర్ వెంకట్ నామిశెట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణనాథుడికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ వినాయకుడు విఘ్నాలను తొలగించి, విజయాలను ప్రసాదించే దేవుడని, ప్రతి శుభకార్యానికి గణనాథుడి పూజతో శ్రీకారం చుట్టడం మన సంస్కృతిలో ప్రత్యేకమైన సంప్రదాయమని అన్నారు. వినాయక చవితి పర్వదినం భక్తి, ఆధ్యాత్మికతతో పాటు ప్రజలందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. గణపతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉందని, ఉత్సవ కమిటీలు, యువత, స్థానిక ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని కేంద్ర మంత్రి అన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను అందరూ శాంతియుతంగా, భక్తిభావంతో, పరస్పర సహకారంతో నిర్వహించుకోవాలని కేంద్ర మంత్రి కోరారు.గణపతి ఉత్సవాలు కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలు మాత్రమే కాకుండా ప్రజల మధ్య సోదరభావాన్ని, ఐక్యతను పెంపొందించే వేడుకలుగా నిలుస్తాయని అన్నారు. యువత ఉత్సవాల్లో చురుగ్గా పాల్గొంటూ సేవా కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.గణనాథుడి కృపతో రాష్ట్రంలోని ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని, ప్రజల జీవితాల్లో ఉన్న అన్ని విఘ్నాలు తొలగి అభివృద్ధి, విజయాలు చేకూరాలని శ్రీ వినాయకుడిని వేడుకున్నట్లు భూపతి రాజు శ్రీనివాస వర్మ తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యాడికిలో నేత్రపర్వంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి హోమాలు, సిద్ధి బుద్ధి వినాయక కల్యాణం



యాడికి సెప్టెంబర్ 15 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండలంలోని శ్రీశ్రీశ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి శాలలో వేద పండితుల మంత్రోచ్చారణలు, భక్తుల జయ జయధ్వానాల నడుమ ఆధ్యాత్మిక కార్యక్రమాలు వైభవంగా సాగాయి. సోమవారం ఉదయం 6 గంటలకు వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా గణపతి పూజ, సుదర్శన పూజలు నిర్వహిస్తూ వేడుకలను ప్రారంభించారు. అనంతరం లోక కల్యాణార్థం, భక్తుల శ్రేయస్సును కాంక్షిస్తూ గణపతి హోమం, సుదర్శన హోమం, లక్ష్మీ హోమం, వెంకటేశ్వర హోమం, నరసింహస్వామి హోమం, అలాగే దేవత పెద్దమ్మ హోమంతో పాటు మొత్తం 9 రకాల ప్రత్యేక హోమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో, విధివిధానాల ప్రకారం నిర్వహించారు. పూజలు, హోమాలతో అమ్మవారి శాల ఆవరణమంతా ఆధ్యాత్మిక శోభతో విలసిల్లింది.ఈ ఆధ్యాత్మిక ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 9 గంటలకు శ్రీశ్రీశ్రీ సిద్ధి బుద్ధి సమేత వినాయక స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. నూతన వస్త్రాలు, మంగళ వాద్యాలు, దివ్యమైన పూల అలంకరణల నడుమ సాగిన స్వామివారి కల్యాణ ఘట్టాన్ని చూసి భక్తులు పులకించిపోయారు.ఈ మహోత్సవానికి పలువురు ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరై స్వామి, అమ్మవార్ల ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ భూమా నాగరాజు, యాడికి మాజీ ఎంపీటీసీ బొంబాయి వెంకట్ నాయుడు, యాడికి గ్రామ పెద్దలు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు, మహిళా మండలి ప్రతినిధులు మరియు యువజన సంఘాల సభ్యులు విశేష సంఖ్యలో విచ్చేసి పూజలు నిర్వహించారు.కల్యాణ మహోత్సవం అనంతరం విచ్చేసిన భక్తులందరికీ దాదాపు 1000 మందికిపైగా వైభవంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. నిర్వాహకుల సమన్వయంతో, గ్రామస్థుల సహకారంతో ఈ మొత్తం ఆధ్యాత్మిక కార్యక్రమాలు అత్యంత దిగ్విజయంగా, భక్తిరసభరితంగా ముగిశాయి.



## ఈ నెల 17 న, ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలకు సీతానగరం మునికూడలి ఘాట్లు ముస్తాబు!

**నియోజకవర్గంలో భారీ ఎత్తున మోడీ పుట్టినరోజు సంబరాలకు సన్నాహాలు..**

**- బీజేపీ సీనియర్ నేత నీరుకొండ వీరన్న చౌదరి..**



కోరుకొండ, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);ఈనెల 17వ తారీకు గురువారం నాడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా సీతానగరం, మునికూడలి ఘాట్ వద్ద వేలాది దీపాలతో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించనున్నట్లు భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, కూటమి నేత నీరుకొండ వీరన్న చౌదరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోడీ జన్మదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని మూడు మండలాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను భారతీయ జనతా పార్టీ నాయకులు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. మునికూడలి వద్ద వెలసిన వినాయకుని గుడిలో ప్రత్యేక పూజలు చేసి, ఘాట్ వద్ద వేలాది దీపాలను వెలిగించి ప్రధాని మోడీకి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతామని వీరన్నచౌదరి వివరించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ప్రపంచ రికార్డుతో పాల్వంచ పట్టణానికి ఖ్యాతి

- **అంతర్జాతీయ వేదికపై మన విద్యార్థుల ప్రతిభ గర్వకారణం**
- **విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందనీయులు**
- **అబ్దుల్ నుమాన్, రావుల దీక్షితశ్రీ పాల్వంచ ఆణిముత్యాలు**
- **అభినందన సభలో కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్**



ఖమ్మం, పాల్వంచ, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ ::: చిన్ననాటి నుంచే విద్యార్థులు చదువుతో పాటు ఏదో ఒక క్రీడను ఎంచుకొని సాధన చేస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ అన్నారు. అంతర్జాతీయ వేదికపై అద్భుత ప్రతిభ కనబరిచి, ప్రపంచ రికార్డుతో పాల్వంచ పట్టణ ఖ్యాతిని చాటిన స్థానిక విద్యార్థులు అబ్దుల్ నుమాన్, దీక్షితశ్రీలను ఆయన పట్టణ ఆణిముత్యాలుగా కొనియాడారు. పట్టణంలోనీ లిటిల్ ఫ్లవర్ స్కూల్, వెంగళరావు కాలనీలో ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన సభకు మేయర్ మూడ్ గణేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రపంచ రికార్డు సృష్టించిన అబ్దుల్ నుమాన్, రావుల దీక్షితశ్రీలను ఆయన శాలువాతో సత్కరించి, మెమెంటోలను అందజేశారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ, గ్లోబల్ వేదికపై మన ప్రాంత విద్యార్థులు ప్రతిభ చాటడం అందరికీ గర్వకారణమన్నారు. నేటి పోటీ ప్రపంచంలో చదువుతో పాటు శారీరక, మానసిక ఉల్లాసానికి, కెరీర్ ఎదుగుదలకు క్రీడలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యార్థుల్లోని ప్రత్యేక ప్రతిభను సకాలంలో గుర్తించి, వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులు, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుల కృషి అభినందనీయమన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువుల మార్గదర్శకత్వం తోడైతే విద్యార్థులు ఏ రంగంలోనైనా అద్భుతాలు సృష్టిస్తారని ఈ విద్యార్థులు నిరూపించారని మేయర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా, ఉప్పుశెట్టి రాహుల్, కార్పొరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరరావు గుర్రం వెంకటేశ్వర్లు నామ కీర్తి, పగిడిపల్లి జయలక్ష్మి, హోలీ శ్రీను, నాయకులు కాసర్ల రామారావు, గౌతమి కృష్ణ పల్లపు యాకయ్య, కుర్రు రమేష్, గొర్లె నరేష్, నామ పండు, నూనావత్ దినేష్, ఆలపాటి ప్రసాద్, తులసీరాం, కిరణ్, వాంగుడోత్ రవి, బిక్కులాల్, అల్లి వెంకటేశ్వర్లు, లిటిల్ ఫ్లవర్ స్కూల్ అదినేత మగలూరు కృష్ణ, నుమాన్ తల్లితండ్రులు అబ్దుల్ రెహమాన్, ఆయేషా ఫిర్దోస్, దీక్షితశ్రీ తల్లితండ్రులు రావుల శ్రీనివాస్, సుమలత, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## "జనసైనికుడు కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్"



తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 15 (నేటి –శుభోదయ): జనసేన పార్టీ అధినేత, ఉపముఖ్యమంత్రివర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల సందర్భంగా నిర్వహించిన బైక్ ర్యాలీ కార్యక్రమంలో అయినవిల్లి మండలం క్రాప గ్రామానికి చెందిన జనసైనికుడు అడపా మల్లేష్ మృతి చెందడం అత్యంత దురదృష్టకరమని తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఈ విషాద ఘటనపై తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్,బొలిశెట్టి శ్రీనివాస్ వెంటనే స్పందించి, మల్లేష్ కుటుంబాన్ని పరామర్శించి 1,00,000/- (లక్ష రూపాయలు)ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లేశును ఎవరు తీసుకురాలేరనికష్టకాలంలో కుటుంబానికి అండగా ఉండటం మన బాధ్యత అని వారికి అండగా ఎల్లప్పుడు ఉంటామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. జనసేన కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ పార్టీ అండగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

## మునగాల గ్రామ పంచాయతీ రేసులో జనసేన సీనియర్ నాయకుడు 'కొండపల్లి హరి'..!

**– కూటమి నాయకులు, జనసైనికుల సంపూర్ణ మద్దతు.!**



కోరుకొండ, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ ప్రతినిధి(ఏ.కె);తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ మండలం మునగాల గ్రామ పంచాయతీ స్థానిక సమరంలో జనసేన పార్టీ సీనియర్ నాయకుడు కొండపల్లి హరి (రాఘవ) పోటీకి సిద్ధమయ్యారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మునగాల గ్రామం నుండి సర్పంచిగా లేదా ఎంపీటీసీగా బరిలోకి దిగుతున్నట్లు ఆయన మీడియా ముందు ప్రకటించారు. జనసేన పార్టీ ఆవిర్భావ సమయం నుంచీ క్రియాశీలకంగా పనిచేస్తూ, గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి విశేష కృషి చేసిన నాయకుడిగా కొండపల్లి హరికి మంచి గుర్తింపు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన



మాట్లాడుతూ... జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు, ఆశయాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడమే నా ప్రధాన లక్ష్యం. మునగాల ప్రజలు నాకు అవకాశం ఇస్తే, మా అభిమాన నాయకులు, స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆసిస్సులతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఒక ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్ది చూపిస్తాను'.. అని ధీమా వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యం, అభివృద్ధి, సామాజిక శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తానని, మునగాల గ్రామ సమగ్ర అభివృద్ధే తన ఏకైక లక్ష్యమని కొండపల్లి హరి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.కాగా గ్రామంలో ఇప్పటికే పార్టీలకతీతంగా యువకులు, మహిళలు, అన్ని వర్గాల మద్దతును కూడగడుతున్నారు.. స్థానిక సమస్యల పరిష్కారానికి గత కొంతకాలంగా హరి గ్రామంలో విశేష కృషి చేస్తున్నారు.

## వినాయక నిమజ్జన ఘాట్‌లను పరిశీలించిన జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్

**అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా**

**పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశం**



ఆత్మకూరు, సెప్టెంబర్ 15: వినాయక నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సజావుగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ ముందస్తు చర్యలు చేపడుతోందని నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలోని వెలుగోడు, ఆత్మకూరు, పాములపాడు, జూపాడుబంగ్లా తదితర పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉన్న వినాయక నిమజ్జన ఘాట్‌లు, ఊరేగింపులు జరిగే ప్రధాన ప్రాంతాలను జిల్లా ఎస్పీ స్వయంగా సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నిమజ్జన ఘాట్‌ల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా చర్యలు, భక్తులు, ప్రజల రాకపోకలు, వాహనాల నియంత్రణ, పోలీస్ బందోబస్తు తదితర అంశాలపై సంబంధిత పోలీస్ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వినాయక నిమజ్జనం సందర్భంగా భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఘాట్‌ల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. నిమజ్జన కార్యక్రమాలు సజావుగా జరిగేలా ఘాట్‌ల వద్ద నిరంతరం పోలీస్ సిబ్బంది అందుబాటులో ఉండాలని, రద్దీని క్రమబద్ధీకరించడంతో పాటు ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. నిమజ్జన కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని, పోలీస్ శాఖ సూచించిన భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు డీఎస్పీ రామంజి నాయక్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ అశోక్, ఆత్మకూరు అర్బన్ సీఐ మహేశ్వర్ రెడ్డి, రూరల్ సీఐ ఎం. సురేష్ కుమార్ రెడ్డి, పాములపాడు ఎస్ఐ పి. తిరుపాలు, సంబంధిత పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## కేసీ కెనాల్‌లో పడి పదో తరగతి విద్యార్థి మృతి

**14 ఏళ్ల బాలుడి మృతితో తుడిచెర్ల మజారా గ్రామంలో విషాదఛాయలు**

తుడిచెర్ల, సెప్టెంబర్ 15: తుడిచెర్ల మజారా గ్రామం కనకయ్య కొట్టాల సమీపంలో మంగళవారం విషాద ఘటన చోటుచేసుకుంది. కేసీ కెనాల్ 114వ తూము వద్ద ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయిన పదో తరగతి విద్యార్థి మేకల లింగస్వామి (14) మృతి చెందాడు.స్థానికుల వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం సుమారు 11.30 గంటల సమయంలో ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదవశాత్తు కేసీ కెనాల్‌లో పడిపోయిన లింగస్వామి నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుడు మేకల శివలింగేశ్వరుడు, మేకల మధులత దంపతుల చిన్న కుమారుడు. పదో తరగతి చదువుతున్న లింగస్వామి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. చిన్న వయసులోనే బాలుడు మృతి చెందడంతో కనకయ్య కొట్టాల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

# అనుమతులు ఓచోట తవ్వకాలు మరోచోట

**– మధిర మండలంలో యథేచ్ఛగా అక్రమ మట్టి మాఫియా – కోర్టు వివాదంలో ఉన్న భూముల్లోనూ ఆగని తవ్వకాలు**

**రెండు కొండలు మాయం**

**– మరొకటి కరిగిపోయే ప్రమాదం**

**– వాపోతున్న ఎండపల్లి గట్టు దళిత రైతులు**

ఖమ్మం, మధిర, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ ::: మండల పరిధిలో అక్రమ మట్టి తవ్వకాలు నిరాటంకంగా సాగుతున్నాయి. అనుమతులు ఒకచోట తీసుకుని తవ్వకాలు మరోచోట జరుపుతూ అక్రమార్కులు నిబంధనలను యథేచ్ఛగా తుంగలో తొక్కుతున్నారు. సిరిపురం గ్రామాన్ని ఆనుకుని ఉన్న ఎండపల్లి పరిసర ప్రాంతాల్లో కొండలను సైతం పిండిచేస్తూ మట్టిని తరలిస్తుండటంతో స్థానిక రైతులు, భూ బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### కోర్టు పరిధిలో ఉన్నా ఆగని దందా

ఎండపల్లి ప్రాంతంలోని సర్వే నంబర్లు 61, 62, 63ల పరిధిలో సుమారు 250 ఎకరాల ప్రభుత్వ, అటవీ భూములు విస్తరించి ఉన్నాయి. ఇందులో సుమారు 84 ఎకరాలను ప్రభుత్వం గతంలో పారిశ్రామిక అవసరాల నిమిత్తం కేటాయించింది. అయితే, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమయంలో పేద రైతులకు జీవనోపాధి కోసం ఒక్కొక్కరికి 16 కుంటల చొప్పున ప్రభుత్వం సాగు పట్టాల మంజూరు



చేసింది. ఇటీవల భూములు సాగులో లేవనే నెపంతో ప్రభుత్వం ఆ పట్టాలను రద్దు చేసి, సదరు భూమిని ఇతరులకు కేటాయించింది. దీనిపై బాధితులు న్యాయం కోసం కోర్టును ఆశ్రయించారు. భూ వివాదం ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉండగానే, కొందరు అక్రమార్కులు ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రింబవళ్లు భారీ యంత్రాలతో మట్టి తవ్వకాలు చేపడుతుండటంపై రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు. "కేసు కోర్టులో నడుస్తుండగా తవ్వకాలు ఎలా చేపడతారు" అని బాధితులు తీవ్రంగా ప్రశ్నిస్తున్నారు.

### కరిగిపోతున్న కొండలు.

ఈ ప్రాంతంలో గతంలో మూడు సహజసిద్ధమైన కొండలు ఉండేవి. నిరంతరాయంగా సాగుతున్న మట్టి తోలకాల కారణంగా ఇప్పటికే రెండు కొండలు పూర్తిగా కనుమరుగైపోగా, ప్రస్తుతం మిగిలిన ఒకే ఒక్క కొండ కూడా కరిగిపోయే స్థితికి చేరింది. అనుమతులు లేని ఈ భారీ తవ్వకాల వల్ల ఓవైపు పర్యావరణ విధ్వంసం జరుగుతుండగా, మరోవైపు మైనింగ్ రాయల్టీ చెల్లించకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది.

### బాధితుల ఆవేదన

అనుమతులు ఇచ్చిన ప్రాంతాన్ని వదిలిపెట్టి వివాదాస్పద స్థలాల్లో యథేచ్ఛగా తవ్వుతున్నా సంబంధిత రెవెన్యూ, మైనింగ్, అటవీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలని, అక్రమ మట్టి రవాణాను తక్షణమే నిలిపివేసి బాధితులకు న్యాయం చేయాలని స్థానిక రైతులు డిమాండ్ చేస్తున్నారు.



# 22ఏ అక్రమాలపై న్యాయ విచారణ జరపాలి : కేటీఆర్

**– ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారు**

**– 30 శాతం కమిషన్ల కోసం చిల్లర ప్రయత్నాలు మానుకోవాలి**

**బేషరతుగా క్షమాపణ చెప్పి కాలనీలు, అపార్ట్‌మెంట్లు, ఇళ్లను జాబితా నుంచి తొలగించాలి**

**– ధరణి రక్షణ కవచం, ఇప్పుడు 'భూభారతి కాదు, భూ హారతి'**

**– అసైన్డ్ భూములపై ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ, ఎస్టీలకు యాజమాన్య హక్కులు కల్పించాలి**

**– ప్రభుత్వం చేసిన తప్పులకు ప్రజలు శిక్ష అనుభవిస్తున్నారు**

**రెండేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుంది, అన్ని అక్రమాలు వెలుగులోకి తెస్తాం**





న్యూఢిల్లీ, హైదరాబాద్ , సెప్టెంబర్ 15, నేటి శుభోదయ ::: 22ఏ కింద లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టి దోపిడీకి పాల్పడుతున్నారని, 30 శాతం కమిషన్ల కోసం చేస్తున్న చిల్లర ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు బయలుదేరిన కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 22ఏ అంశంపై అసెంబ్లీలో ప్రభుత్వం సరైన సమాధానం ఇస్తుందని ఆశించామని, అయితే రెవెన్యూ మంత్రి కేవలం 'సారీ'తో సరిపెట్టారని కేటీఆర్ అన్నారు. "తప్పు చేసింది అధికారులు కాదు.. ప్రభుత్వమే. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా అధికారులపై నెపం నెట్టడం సరికాదు" అని అన్నారు. ప్రజలు తమ కష్టార్జితంతో కొనుగోలు చేసిన కాలనీలు, అపార్ట్‌మెంట్లు, ఇళ్లను నిషేధిత జాబితాలో చేర్చినట్లయితే వాటిని బేషరతుగా తొలగించి, బాధితులకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

### - ధరణి రక్షణ కవచం

ధరణి వ్యవస్థ ప్రజల ఆస్తులకు రక్షణ కవచంలా ఉండేదని కేటీఆర్ పేర్కొన్నారు. యజమాని వేలిముద్ర లేకుండా ఆస్తి బదిలీ చేయడం సాధ్యం కాని విధంగా భద్రత ఉండేదన్నారు. ప్రస్తుతం యజమానులకు తెలియకుండానే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని, ఆస్తులు నిషేధిత జాబితాలోకి వెళ్తున్నాయని ఆరోపించారు. "ఇది భూభారతి కాదు. భూ హారతి" అని వ్యాఖ్యానించారు. అన్ని అడ్డగోలు చర్యలను నిలిపివేసి, ప్రజల యాజమాన్య హక్కులకు రక్షణ కల్పించేలా యథాతథ పరిస్థితిని పునరుద్ధరించాలని కోరారు.

### - అసైన్డ్ భూములపై హామీ నిలబెట్టుకోవాలి

అసైన్డ్ భూముల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని ఇచ్చిన హామీని ఇప్పుడు అమలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు చెందిన అసైన్డ్ భూములను రెగ్యులరైజ్ చేసి, వారికి యాజమాన్య హక్కులు కల్పించాలని అన్నారు. అసైన్డ్ భూములకు పట్టాలిచ్చే పేరుతో ముందుగానే ఒప్పందాలు జరుగుతున్నాయన్న అనుమానాలు ఉన్నాయని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి పథకం వెనుక అక్రమాలు ఉన్నాయన్న తమ ఆరోపణలు భవిష్యత్తులో వెలుగులోకి వస్తాయని అన్నారు. "రెండేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుంది. తప్పు చేసిన వారిని వదిలిపెట్టం" అని పేర్కొన్నారు.

### ప్రధాన ప్రతిపక్షాన్ని సభ నుంచి బయటకు పంపారు

ప్రజాస్వామ్యంలో ప్రధాన ప్రతిపక్షంగా నిరసన తెలిపే హక్కు తమకుందని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ సభ్యులు అనని మాటలను అంటగట్టి, సభ నుంచి బయటకు పంపారని ఆరోపించారు. ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అంశాల నుంచి తప్పించుకునేందుకే తమను సస్పెండ్ చేసిందన్నారు. 'సస్పెండ్ చేసినప్పటికీ మేము ప్రజల్లోనే ఉన్నాం. ప్రజా సమస్యలను ఎత్తిచూపుతూనే ఉంటాం. 22ఏ అంశమైనా, ప్రజల భూముల సమస్యలైనా ప్రజల మధ్యకు తీసుకెళ్తాం" అని కేటీఆర్ అన్నారు.

### 22ఏపై న్యాయ విచారణకు స్వాగతం

22ఏ వ్యవహారంపై జ్యుడీషియల్ ఎంక్వైరీ జరిగితే అందరికీ మంచిదేనని కేటీఆర్ అన్నారు. "తప్పు చేసింది ప్రభుత్వం శిక్ష అనుభవిస్తున్నది ప్రజలు" అని వ్యాఖ్యానించారు. నిషేధిత జాబితాలో ఆస్తులను చేర్చడం ద్వారా ప్రజల యాజమాన్య హక్కులను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. ఇవాళ తప్పించుకున్నా రేపు తప్పించుకోలేరని హెచ్చరించారు.

### పోలీసులపై నమ్మకం లేదు, న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం

ప్రతిపక్ష నేత కేసీఆర్ ఇంటిపై దాడి ఘటనను ప్రస్తావిస్తూ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. తమ సిబ్బందిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి అక్కడే కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల కంటే హీనంగా పనిచేస్తున్నారని విమర్శించారు. 'పోలీసులను నమ్ముకుంటే న్యాయం దొరకదనే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తున్నాం. న్యాయస్థానంలో తప్పకుండా న్యాయం దొరుకుతుందని ఆశిస్తున్నాం" అని కేటీఆర్ అన్నారు. కామన్ సివిల్ కోడ్‌పై ఇప్పుడే నిర్ణయం చెప్పాల్సిన అవసరం లేదని, అలాంటి ప్రతిపాదన వచ్చినప్పుడు పార్టీ నాయకత్వంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కేటీఆర్ తెలిపారు.

# చింతూరు బస్టాండ్‌కు కొత్త రూపు

**– ప్రయాణికుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి**

**మౌలిక సదుపాయాల మెరుగుదలపై ఐ టీ డి ఎ ప్రాజెక్టు అధికారి శుభమ్ నొక్వాల్ సమీక్ష**

**– ఏ పి ఎస్ ఆర్ టి సి బస్టాండ్ లో త్రాగునీరు విద్యుత్, మరుగుదొడ్లు, పారిశుధ్యం, బెంచీలు, బస్సు సర్వీసులపై తక్షణ చర్యలకు ఆదేశాలు**





చింతూరు, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ ::: చింతూరు డివిజన్ కేంద్రంలోని బస్టాండ్‌ను ప్రయాణికులకు మరింత సౌకర్యవంతంగా, పరిశుభ్రంగా, సురక్షితంగా తీర్చిదిద్దేందుకు ఐ టీ డిఎ చింతూరు ప్రాజెక్టు అధికారి ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించిన ప్రాజెక్టు అధికారి, బస్టాండ్‌లో ప్రస్తుతం ఉన్న మౌలిక సదుపాయాలు, ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు, చేపట్టాల్సిన తక్షణ అభివృద్ధి చర్యలపై సమగ్రంగా సమీక్షించారు.

### - ప్రయాణికుల సౌకర్యాలే ప్రధాన లక్ష్యం

బస్టాండ్‌లో ప్రయాణికులకు అవసరమైన త్రాగునీరు, విద్యుత్ సరఫరా, మరుగుదొడ్లు, పారిశుధ్యం, కూర్చునే సదుపాయం, బస్సుల రాకపోకల సమాచారం తదితర అంశాలపై ప్రాజెక్టు అధికారి ప్రత్యేకంగా దృష్టి సారించారు. నిరంతర త్రాగునీరు, విద్యుత్ సదుపాయాలు అందుబాటులో ఉండేలా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మరుగుదొడ్లలో అవసరమైన మరమ్మతులను వెంటనే పూర్తి చేసి, వాటిని పరిశుభ్రంగా, సురక్షితంగా, ప్రయాణికులకు సౌకర్యవంతంగా వినియోగించుకునే విధంగా నిర్వహించాలని సూచించారు.

### - పరిశుభ్రతపై ప్రత్యేక పర్యవేక్షణ

బస్టాండ్ పరిసరాల్లో నిరంతర పారిశుధ్య చర్యలు చేపట్టి, ప్రయాణికులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని అధికారులను ఆదేశించారు. బస్టాండ్‌లోని అన్ని మౌలిక సదుపాయాల నిర్వహణ, పరిశుభ్రత మరియు ప్రయాణికుల సమస్యల పరిష్కారంపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా ప్రత్యేక మానిటరింగ్ అధికారిని నియమించనున్నట్లు సంబంధిత అధికారులు ప్రాజెక్టు అధికారికి తెలిపారు.

### బస్సుల సమాచారం ప్రయాణికులకు సులభంగా

బస్సుల రాకపోకల సమయాలను ప్రయాణికులు సులభంగా తెలుసుకునే విధంగా స్పష్టమైన సమాచార బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రాజెక్టు అధికారి ఆదేశించారు. అదేవిధంగా, ప్రయాణికులు వేచి ఉండే సమయంలో ఇబ్బంది పడకుండా అవసరమైన ప్రదేశాల్లో అదనపు బెంచీలను ఏర్పాటు చేయాలని సూచించారు.

### - రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు

చింతూరు బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ, అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన రూట్లలో అదనపు బస్సు సర్వీసులు ఏర్పాటు చేసేలా సంబంధిత రవాణా అధికారులతో సమన్వయం చేసుకోవాలని ప్రాజెక్టు అధికారి సూచించారు.

### - సమన్వయంతో సమగ్ర అభివృద్ధి

చింతూరు డివిజన్ బస్టాండ్‌ను కేవలం బస్సులు రాకపోకలు సాగించే ప్రదేశంగా కాకుండా, ప్రజలకు అవసరమైన అన్ని ప్రాథమిక సదుపాయాలు అందుబాటులో ఉండే సౌకర్యవంతమైన ప్రజా రవాణా కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రాజెక్టు అధికారి స్పష్టం చేశారు. ప్రయాణికుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటికి వేగంగా స్పందించి పరిష్కారం చూపే విధంగా పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా, చింతూరు బస్టాండ్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రాజెక్టు అధికారి ఆదేశించారు.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .